# ఆహారంలో పెస్టిసైడ్, ఫర్టిలైజర్ అవశేషాలు - ప్రమాదంలో ప్రజారోగ్యాలు !

ఆహార భద్రత సాధనకు భారత ప్రభుత్వం 1960ల్లో ఎం ఎస్ స్వామినాథన్ నేతృత్వంలో నార్మన్ బోర్లాగ్ చేపట్టిన హరిత విప్లవం(గ్రీన్ రెవొల్యూషన్)లో భాగంగా వ్యవసాయ రంగంలో దిగుబడులను పెంచడానికి వివిధ రకాల పురుగు మందులు, రసాయన ఎరువులు, యాంత్రిక పద్ధతులు, నీటిపారుదల సౌకర్యాలు, కొత్త వంగడాల వినియోగం లాంటి సాంకేతిక విధానాలను అమలులోకి తేవడంతో ఆహార ఉత్పత్తుల దిగుబడులు అధిక మొత్తంలో పెరిగి ఆహార అభద్రత కోరల్లోంచి మానవాళిని కాపాడడంలో సఫలత సాధించాం. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, పశ్చిమ యూపీ ప్రాంతాల్లో హరిత విప్లవ ఫలితాలు గణనీయంగా నమోదు అయ్యాయి. హరిత విప్లవం ద్వారా ఆహార భద్రత సఫలం కావడంతో దేశ ఆర్థిక వ్యవస్థకు మేలైన మద్దత్తు లభించింది.

**క్యాన్సర్ బెల్ట్ ఆఫ్ ఇండియా, క్యాన్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా !**

హరిత విప్లవంతో ప్రయోజనం కలిగినప్పటికీ కొత్త విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమిసంహార మందులు, సాగు యంత్రాలు, ట్రాక్టర్ లాంటివి రావడంతో చిన్న సన్నకారు రైతులకు ఆర్థిక భారం కలుగుతున్నది. అధిక పురుగు మందులు, రసాయన ఎరువుల అవశేషాలున్న ఆహారం తినడం, అవి నిండిన గాలి పీల్చడంతో పంజాబ్‌లో క్యాన్సర్ కేసులు పెరుగుతూ 'క్యాన్సర్ బెల్ట్ ఆఫ్ ఇండియా'గా, బటిండా ప్రాంతం 'క్యాన్సర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా పేరును తెచ్చుకున్నాయి. ఆర్గానోక్లోరిన్స్, ఆర్గానోఫాస్ఫేట్స్, కార్బమేట్స్, కొన్ని రకాల కలుపు మందులు(హెర్బిసైడ్స్) వాడడంతో ఆరోగ్య సమస్యలు తీవ్రం అవుతున్నాయి. భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన ఎండిహెచ్, ఎవరెస్ట్ కంపెనీల మసాల పొట్లాల్లో ప్రమాదకర స్థాయిలో 'ఇథిలిన్ ఆక్సైడ్' గాఢతలు ఉన్నట్లు ఇటీవల పరిశోధనలు తేల్చాయి. ఈ కంపెనీల ఉత్పత్తుల్లో పెస్టిసైడ్ అవశేషాల పరిమితులను 10 రెట్లు పెంచడం కూడా సమస్యను మరింత జటిలం చేస్తున్నది.

**వెయ్యికి పైగా పెస్టిసైడ్స్ వాడుతున్నామా !**

దిగుబడులు పెరగాలనే ఆశతో రైతాంగం విచక్షణారహితంగా రసాయన ఎరువులు, పురుగు/కలుపు మందులు మితిమీరిన మోతాదులో వాడడంతో పర్యావరణం, నేల, ప్రాణికోటి ఆరోగ్యం, జీవ వైవిధ్యాలపై ప్రతికూల ప్రభావం చూపడం క్రమంగా పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పంటలను పాడు చేస్తున్న క్రిమికీటకాలు, కలుపు మొక్కలను తుదముట్టించడానికి రైతులు విపరీతంగా, అనాలోచితంగా, విచక్షణారహితంగా 1,000కి పైగా రకాల పెస్టిసైడ్స్ లేదా పురుగు మందులను వాడడం గత ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్నది. ఇటీవల భారత ప్రజలు వాడుతున్న ఆహార పదార్థాల్లో పరిమితులు దాటి పురుగు మందుల అవశేషాలు కనిపించడంతో మనం తినే ఆహారమే ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారుతున్నట్లు తోస్తున్నది. 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ)' సంస్థ మన ఆహారంలో పెస్టిసైడ్స్ అవశేషాల పరిమితులను 10 శాతం వరకు పెంచడం కూడా రానున్న ప్రజారోగ్య ప్రమాదానికి హెచ్చరికగా మారింది. ముఖ్యంగా ఆపిల్స్, స్ట్రాబెర్రీస్, ద్రాక్షలు, ఆకుకూరలు, టమాటాలు, ఆలుగడ్డలు లాంటి ఆహార పదార్థాల ఉపరితాలపై ప్రమాదకర స్థాయిలో పురుగు మందుల అవశేషాలు అధికంగా ఉంటున్నాయి.

**ఆహారంలో పురుగు మందుల అవశేషాలతో కలిగే అనారోగ్యాలు:**

కూరగాయలు, పండ్లు, ఇతర పంటల దిగుబడులను పెంచడానికి విపరీతమైన విషతుల్య క్రిమిసంహారక మందులు అధిక మోతాదులో వాడడంతో మానవాళిలోయ సంతానోత్పత్తి, శ్వాసకోశ వ్యవస్థ, నాడీమండల, క్యాన్సర్ లాంటి పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. పురుగు మందులతో కూడా ఆహారం తీసుకోవడంతో పలు దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రతికూల ప్రభావాలు అనుభవించాల్సి వస్తున్నది. స్వల్పాలిక అనారోగ్య సమస్యల్లో ముక్కు, గొంతు, చర్మం, డయేరియా, దద్దుర్లు, బొబ్బలు, వికారం లాంటివి కనిపిస్తున్నాయి. దీర్ఘకాలిక అనారోగ్యాల్లో నాడీమండల, క్యాన్సర్, పుట్టుకతో అంగవైకల్యం, సంతానలేమి, కాలేయ, మూత్రపిండ, ఊపిరి తిత్తుల, స్థూలకాయ, నిద్రలేమి, ఇతర అవయవాల సమస్యలు కలుగుతున్నాయి. ఒక్కొక్క పురుగు మందుకు ఒక్కొక్క ధర్మం, విష ప్రభావం ఉంటాయి. పురుగులను చంపడం లేదా తరిమేయడానికి వాడుతున్న పెస్టిసైడ్ డోసులు, అనేక సార్లు వాడడంతో పండ్లు, గింజలు, కూరగాయల దిగుబడుల్లో పురుగు మందుల అవశేషాలు ప్రమాదకరస్థాయిలో ఉంటున్నాయి. పురుగు మందుల అవశైషాలు ఉన్న ఆహారం తినడం, గాలి పీల్చడం, చర్మంపై నేరుగా ప్రభావం చూపడం అనాదిగా జరుగుతోంది. పురుగు మందుల అవశేషాలు అధికంగా ఉన్న ఆహారం వల్ల పిల్లల్లో తీవ్ర అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావడం భయాన్ని కలిగిస్తున్నది. పిల్లల్లో మానసిక ఎదుగుదల, దృష్టి దోషం, శరీర సమన్వయం, ఆటిజం, అటెన్షన్ డెఫిషట్ హైపర్ఆక్టివిటీ డిజార్డర్ లాంటి అనారోగ్యాలు కనిపిస్తున్నాయి.

**పురుగు మందుల అవశేషాలు లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు:**

పండ్లు, కూరగాయలు, ఆహార పదార్థాలను శ్రద్ధగా చల్లని నీటితో కడగడం, సాఫ్ట్ బ్రష్‌తో శుభ్రం చేయడం, కడిగే నీటికి బేకింగ్ సోడా/వెనిగర్/ఉప్పు లాంటివి వేయడం మరువరాదు. పండ్లు, కూరగాయల పొట్టలను తొలగించి తినడం, వీలైనపుడు పండ్లను ఉడికించి తినడం, వేడి నీటితో కడిగిన తర్వాత చల్లని నీటితో శుభ్రం చేయడం, పలు రకాల ఆహార పదార్థాలను మార్చి మార్చి తీసుకోవడం, వీలైనంత వరకు ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులను వాడడం, మన పెరటిలో లేదా ఇంటిపై పండ్లు/కూరగాయలు పండించుకోవడం లాంటి చర్యలు మన ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయని తెలుసు కోవాలి. పంటల మార్పిడి, సంపోస్ట్, బయలాజికల్ పెస్ట్ కంట్రోల్ లాంటి చర్యలు మన ఆరోగ్యానికి ఎంతో మేలును చేస్తాయి. ఆర్గానిక్ ఉత్పత్తులు పూర్తిగా సురక్షితం కానప్పటికీ వాటిలో ప్రమాదకర అవశేషాల పరిమితులు చాలా చాలా తక్కువగా ఉంటాయని గుర్తించాయి.

రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, కలుపు మందులు వాడకుండా ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను పండించి రేపటి ప్రజల ఆరోగ్యానికి సురక్షిత దారులు వేద్దాం, ఆహార పదార్థాల్లో ప్రమాదకర అవశేషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# లీడ్ ఇండియా అధ్వర్యంలో ఘనంగా గురు పౌర్ణిమ



సీనియర్ గురువులు సింగమ రాజు, కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డిలను సన్మానిస్తున్న లీడ్ ఇండియా నాయకులు

కరీంనగర్ లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్వర్యంలో నేడు కరీంనగర్ పట్టణంలో ఘనంగా గురు పౌర్ణిమ వేడుకలు జరిగాయి.

ఈ వేడుకల్లో సీనియర్ అధ్యాపకులు, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ ప్రధాన సలహాదారు సింగమ రాజు, అధ్యక్షులు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డిలను క్లబ్ నాయకులు ఇనుగుర్తి రవేష్, వడుకాపురం జగదీశ్వరాచారి, ముత్తోజు వేణుతో పాటు ఇతర సభ్యులు ఘనంగా సన్మానించి తమ గురువుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

# వరల్డ్ హెరిటేజ్ కమిటీ సమావేశాలకు మొట్టమొదటిసారిగా ఆతిథ్యాన్ని ఇస్తున్న భారతదేశం

న్యూఢిల్లీ, జులై 22 :వరల్డ్ హెరిటేజ్ కమిటీ నలభై ఆరో సమావేశాలను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2024 జులై 21న సాయంత్రం పూట 7 గంటలకు న్యూ ఢిల్లీ లోని భారత్ మండపంలో ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగించనున్నారు. ఈ సమావేశాల ప్రారంభ కార్యక్రమానికి యునెస్కో డిజి ఆద్రే అజోలే కూడా హాజరు కానున్నారు.

ప్రపంచ వారసత్వ సంఘం (వరల్డ్ హెరిటేజ్ కమిటీ) సమావేశాలకు భారతదేశం మొట్టమొదటిసారిగా ఆతిథ్యాన్ని ఇస్తున్నది. ఈ సమావేశాలు 2024 జులై 21 నుంచి 31 వరకు న్యూ ఢిల్లీ లోని భారత్ మండపంలో జరుగనున్నాయి. ప్రపంచ వారసత్వ సంఘం ఏడాదికి ఒక సారి సమావేశమవుతూ ఉంటుంది. ప్రపంచ వారసత్వానికి సంబంధించిన అన్ని వ్యవహారాలను నిర్వహించడం తో పాటు ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చవలసిన స్థలాలను గురించిన నిర్ణయాలను తీసుకోవడం ఈ కమిటీకి అప్పగించిన బాధ్యతలు. ఈ సమావేశాలలో, ప్రపంచ వారసత్వ జాబితాలో కొత్త స్థలాలను నామనిర్దేశం చేయడం కోసం ప్రతిపాదనలు, ఇప్పటికే ప్రపంచ వారసత్వ ఆస్తులుగా ఉన్న 124 స్థలాల సంరక్షణ స్థితి నివేదికను గురించి, అంతర్జాతీయ సహాయాన్ని గురించి, ప్రపంచ వారసత్వ నిధుల వినియోగాన్ని గురించి, ఇతరత్రా అంశాలను గురించి చర్చించడం జరుగుతుంది. ఈ సమావేశాల్లో నూటయాభైకి పైగా దేశాల కు చెందిన అంతర్జాతీయ, జాతీయ ప్రతినిధులు రెండు వేల మందికి పైగా పాల్గొంటారు.

ప్రపంచ వారసత్వ సంఘంతో పాటే వరల్డ్ హెరిటేజ్ యంగ్ ప్రొఫెషనల్స్ ఫోరమ్, వరల్డ్ హెరిటేజ్ సైట్ మేనేజర్స్ ఫోరమ్ సమావేశాలను కూడా నిర్వహించనున్నారు.

భారతదేశ సంస్కృతిని చాటి చెప్పే వివిధ ఎగ్జిబిషన్ లను కూడా భారత్ మండపంలో ఏర్పాటు చేయడం జరుగుతుంది. విదేశాల నుంచి భారతదేశానికి తీసుకు వచ్చిన అపురూప కళాకృతులలో కొన్నింటిని 'ది రిటర్న్ ఆఫ్ ట్రెజర్స్ ఎగ్జిబిషన్' లో ప్రదర్శనకు పెడతారు. ఇంతవరకు, మూడు వందల యాభైకి పైగా కళాకృతులను బయటి దేశాల నుంచి భారతదేశానికి తిరిగి తీసుకురావడమైంది. వీటికి తోడు, అత్యాధునిక ఎఆర్, విఆర్ సాంకేతిక పరిజ్ఞ?నం సాయంతో భారతదేశంలోని మూడు ప్రపంచ వారసత్వ స్థలాలు.. గుజరాత్ లోని పాటన్ లో గల రాణీ కీ వావ్; మహారాష్ట్ర లోని ఎల్లోరా గుహలలో నెలకొన్న కైలాస దేవాలయం, కర్నాటక లోని హళేబీడులో గల హ్వాయసల దేవాలయం లను కళ్లకు కట్టే ఎగ్జిబిషన్ కూడా సందర్శకులను అలరించనుంది. భారతదేశ సమృద్ధ సాంస్కృతిక వారసత్వాన్ని, యుగ యుగాల పురాతన చరిత్రను కలిగివున్న భారతదేశ నాగరికతను, భారతదేశ భౌగోళిక వైవిధ్యాన్ని, పర్యటకులకు ప్రధాన ఆకర్షణ గా నిలచే ప్రదేశాలతో పాటు సమాచార సాంకేతిక విజ్ఞ?నం (ఐ.టి.) మరియు మౌలిక సదుపాయాల కల్పన రంగాల విశేషాలను గురించి తెలియజెప్పే అతుల్య భారత్ ('ఇన్ క్రెడిబుల్ ఇండియా') విశిష్ట ఎగ్జిబిషన్ ను కూడా ఇందులో భాగంగా ఏర్పాటు చేయనున్నారు.

# "సానుకూల భారత్ : భవిష్యత్తు సుగమం చేస్తున్న భారత రసాయనాలు, పెట్రో రసాయనాలు" ఇతివృత్తం తో ఇండియా కెమ్ 13 వ ఎడిషన్ను ప్రారంభించిన కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగ్ ప్రకాశ్ నడ్డా

న్యూఢిల్లీ, జులై 22 :"సానుకూల భారత్ : భవిష్యత్తు సుగమం చేస్తున్న భారత రసాయనాలు, పెట్రో రసాయనాలు'' ఇతివృత్తం తో ఇండియా కెమ్ 13 వ ఎడిషన్ను కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగ్ ప్రకాశ్ నడ్డా, కేంద్ర సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్ సమక్షంలో శనివారం నాడు ఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా ఇండియా కెమ్ 13 వ ఎడిషన్కు సంబంధించిన బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రసాయనాలు, పెట్రో రసాయనాల శాఖ కార్యదర్శి శ్రీమతి నివేదిత శుక్ల వర్మ, మంత్రిత్వ శాఖకు చెందిన పలువురు సీనియర్ అధికారుల తోపాటు, పరిశ్రమ ప్రతినిధులు హాజరయ్యారు.

రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జె.పి.నడ్డా మాట్లాడుతూ, ఈ ఈవెంట్లకు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఈ ఏడాది అక్టోబర్లో ఇది ముంబాయిలో 13 వ ఎడిషన్ను జరుపుకునేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఇండియా కెమ్ 2024 ఇతివృత్తం, "సానుకూల భారత్ : భవిష్యత్తు మార్గం సుగమం చేస్తున్న రసాయనాలు, పెట్రోరసాయనాలు"" . 2025 నాటికి భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు ఇది అద్దంపట్టేదిగా ఉందని మంత్రి అన్నారు. అక్టోబర్ 17 నుంచి 19 వరకు ముంబాయిలో ఇండియా కెమ్ 13 వ ఎడిషన్ జరగనున్నందున 2024 ఎంతో కీలకమైన సంవత్సరమని ఆయన తెలిపారు. "దిగుమతులు, పరిశోధన, అభివృద్ధి, మానవ వనరుల శిక్షణపై దృష్టి పెట్టడం ద్వారా , 2047 నాటికి వికసిత్ భారత్ కలను సాకారం చేయడానికి ఈ రంగం తన వంతు పాత్రను పోషించగలదన్న ఆకాంక్షను కేంద్ర మంత్రి వ్యక్తం చేశారు.

పరిశ్రమ ప్రగతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పరిశ్రమ అభివృద్ధికి , ప్రత్యేకించి రసాయనాల రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు వ్యవస్థాగత సంస్కరణలను చేపట్టిందని శ్రీజె.పి.నడ్డా తెలిపారు ప్రభుత్వానికి ఇది ఎంతో ప్రధానమైన రంగమని కూడా మంత్రి చెప్పారు. ఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన విధానపరమైన చర్యలతో ప్రభుత్వం ముందుకు వస్తుందని, పరిశ్రమ ప్రతినిధులకు మంత్రి హామీ ఇచ్చారు. "ముంబాయిలో జరిగే చర్చల ఫలితాలను సాధించేందుకు అవసరమైన విధానపరమైన చర్యలను తమ మంత్రిత్వశాఖ ప్రారంభిస్తుందని ఆయన తెలిపారు..

ఈ కార్యక్రమానికి హాజరైన వారినుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియా పటేల్, ఆటోమోటివ్, నిర్మాణం, ఎలక్ట్రానిక్స్, ఆరోగ్య సంరక్షణ, టెక్స్టైల్స్, ఎఫ్.ఎం.సి.జిల రంగాల ఆర్థిక అభివృద్ధిలో పెట్రో కెమికల్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. " భవిష్యత్ అభివృద్ధికి అవకాశాల కల్పనలో, ఆర్థిక అభివృద్ధిలో రసాయనాల రంగం పాత్ర నానాటికీ పెరుగుతున్నదని ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రపంచంలో వ్యవసాయ రసాయనాలు, రసాయన అద్దకాలు, అద్దకపు రంగుల రంగంలో ఇండియా రెండో అతిపెద్ద ఎగుమతిదారుగా ఉందని'' ఆమె తెలిపారు.

"ఇండియా కెమ్ ప్రారంభం పైనప్పటి నుంచి, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఈ రంగం అభివృద్ధికి ఇది ఎంతగానో దోహద పడింది"'' ని ఆమె తెలిపారు. పెట్టుబడులు, ఉపాధి కల్పనకు మన ఈ పరిశ్రమకు ఎంతగానో శక్తి ఉందని కూడా ఆమె అన్నారు. పెట్టుబడుల అనుకూల సంస్కరణలపై ప్రధానంగా దృష్టి పెట్టడం , విధానపరమైన అడ్డంకులను తొలగించడం ప్రభుత్వం ముందున్న అత్యంత ప్రాధాన్యతాంశా"లని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, మరింతగా నేర్చుకునేందుకు, నూతన అవకాశాలను అన్వేషించేందుకు, నెట్వర్క్కు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆమె కోరారు.

ఇండియా కెమ్ 2024 అనేది రసాయనాలు, పెట్రో రసాయనాల విభాగం ఫ్లాగ్షిప్ కార్యక్రమం. ఆసియా ?పసిఫిక్ లో ఉమ్మడి అతిపెద్ద ఈవెంట్లలో ఇది ఒకటి. ఇందులో అంతర్జాతీయ ఎగ్జిబిషన్లు, సదస్సులు ఉంటాయి. ఇండియా కెమ్ ఎగ్జిబిషన్, భారతీయ రసాయనాల పరిశ్రమ అలాగే ,రసాయనాలు, పెట్రో కెమికల్స్, ఆగ్రో కెమికల్స్ తదితర పారిశ్రామిక విభాగాలలో గల గొప్ప శక్తిని ప్రదర్శించడంతోపాటు, కీలక చర్చలకు , దార్శనిక ఆలోచనలకు , పారిశ్రామిక ప్రతినిధుల మధ్య వ్యూహాత్మక సహకారానికి ఇది మంచి వేదికను కల్పించనుంది. భారతీయ రసాయన పరిశ్రమ విలువ ప్రస్తుతం 220 అమెరికన్ డాలర్లుగా ఉంది. 2030 నాటికి ఇది 300 బిలియన్ అమెరికన్ డాలర్లకుకు చేరుకుంటుందని , 2040 నాటికి 1 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. అంతర్జాతీయ అస్థిర పరిస్థితుల నేపథ్యంలోనూ అద్భుతమైన అవకాశాలకు ఈ పరిశ్రమ ఇప్పటికీ క్రియాశీల కేంద్రంగా ఉంది.

# 2024 పారిస్ ఒలింపిక్స్‌కి 24 మంది సైనిక సర్వీసుల క్రీడాకారులతో పాటు మొత్తం 117 మంది భారతీయ అథ్లెట్లు

న్యూఢిల్లీ, జులై 22 :పారిస్ ఒలింపిక్స్ కి భారత్ బృందం సర్వ సన్నద్ధమైంది ఈ జూలై 26న ప్రారంభమయ్యే పారిస్ ఒలింపిక్స్‌లో దేశం గర్వపడేలా చేయడానికి సిద్ధంగా ఉన్న 117 మంది భారతీయ అథ్లెట్లు తమ సత్తా చాటేందుకు రంగంలోకి దిగుతున్నారు. వీరిలో 24 మంది సాయుధ దళాల నుండి పాల్గొంటున్నారు. ఈ 24 మంది అథ్లెట్లలో స్టార్ జావెలిన్ త్రోయర్ సుబేదార్ నీరజ్ చోప్రాతో సహా 22 మంది పురుషులు ఉన్నారు. ఇద్దరు మహిళలున్నారు. ఒలింపిక్స్‌లో మహిళా సర్వీస్ అథ్లెట్ల తొలి సరిగా పాల్గొంటున్నారు.

2020 టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అయిన సుబేదార్ నీరజ్ చోప్రా, 2023 ఆసియా క్రీడలు, 2023 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్, 2024 డైమండ్ లీగ్, 2024 పావో నుర్మి గేమ్‌లలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని అసాధారణ ప్రదర్శన చేశాడు. ఈ నేపథ్యంలో పారిస్ ఒలింపిక్స్‌లో కూడా అత్యున్నత ప్రతిభను ప్రదర్శించి దేశానికి గౌరవంగా నిలుస్తాడని క్రీడా ప్రేమికులు ఆకాంక్షిస్తున్నారు. 2022 కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేత హవిల్దార్ జైస్మిన్ లంబోరియా, 2023 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సీపీఓ రీతికా హుడా ఇద్దరు మహిళా సేవా సిబ్బంది మొదటిసారిగా గేమ్స్‌లో పాల్గొంటూ, చరిత్ర సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వారు వరుసగా బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడాంశాలలో సత్తా చాటనున్నారు.

సుబేదార్ అమిత్ పంఘల్ (బాక్సింగ్); సీపీఓ తాజిందర్‌పాల్ సింగ్ టూర్ (షాట్-పుట్); సుబేదార్ అవినాష్ ముకుంద్ సేబుల్ (3000 మీ స్టీపుల్‌చేజ్); సీపీఓ ముహమ్మద్ అనస్ యాహియా, పిఓ (జిడబ్ల్యూ) ముహమ్మద్ అజ్మల్, సుబేదార్ సంతోష్ కుమార్ తమిళరసన్, జేడబ్ల్యూఓ మిజో చాకో కురియన్ (4చీ400ఎం పురుషుల రిలే); జెడబ్ల్యూఓ అబ్దుల్లా అబూబకర్ (ట్రిపుల్ జంప్); సుబేదార్ తరుణ్‌దీప్ రాయ్, ధీరాజ్ బొమ్మదేవర (ఆర్చరీ), సుబదార్ సందీప్ సింగ్ (షూటింగ్) కూడా దేశానికి అవార్డులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న సేవా సిబ్బందిలో ఉన్నారు.

# నీట్‌పై ప్రతిపక్షాలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయి

## – మండిపడ్డ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూ ఢిల్లీ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);;: నీట్ పేపర్‌ను ఎన్‌టిఎ తీసుకొచ్చిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. పార్లమెంట్ సమావేశాలలో నీట్ పేపర్ లీకేజీపై చర్చ సందర్భంగా లోక్ సభలో ధర్మేంద్ర మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీపై సిబిఐ విచారణ జరుగుతోందని, నీట్ పరీక్షలపై వివరాలన్నీ సుప్రీంకోర్టుకు ఇచ్చామని తెలియజేశారు. నీట్‌పై ప్రతిపక్షాలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని ధర్మేంద్ర మండిపడ్డారు. గత ఏడు సంవత్సరాల నుంచి నీట్ పేపర్ లీకేజ్ అయినట్లు ఎక్కడ సాక్ష్యాలు లేవన్నారు. ఎన్‌టిఎ తీసుకొచ్చిన తరువాత 240 పరీక్షలు విజయవంతంగా నిర్వహించామన్నారు. నీట్‌పై అర్థవంతమైన చర్చ జరగాలని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. పరస్పర ఆరోపణలతో సాధించేది ఏమీ ఉండదని, పరీక్షను మరింత పటిష్టవంతంగా నిర్వహించేలా ప్రయత్నం చేద్దామని స్పీకర్ పిలుపునిచ్చారు.

# జాతీయ పతాకం భరతమాత ఆత్మ లాంటిది

## – లయన్ హనుమాండ్ల రాజి రెడ్డి, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్




హైదరాబాద్, జులై 22 : భరతమాత పవిత్రమైన ఆత్మ లాంటిది మన త్రివర్ణ పతాకమని, దేశ చిహ్నంగా ప్రపంచ వేదికలో జాతీయ పతాక రెపరెపలు మన వైసుదైక కుటుంబ భావనను విశ్వవ్యాప్తం చేస్తున్నదని మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ పిడిజి హనుమాండ్ల రాజి రెడ్డి అన్నారు. ఈ రోజు జాతీయ పతాక ఆమోద దినం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తూ తెలుగు తేజం పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాక నమూనాలో స్వల్ప మార్పులు చేసి 22 జూలై 1947న రాజ్యాంగ అసెంబ్లీ ఆమోదించడం జరిగిందని అన్నారు. జాతీయ పతాకానికి సముచిత గౌరవం ఇస్తూ దాని ప్రాభవ వైభవాలను ఇతోధికం చేయడానికి ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. విశిష్ట అతిథి ప్రథమ జిల్లా వైస్ గవర్నర్ లయన్ సింహరాజు కోదండ రాములు మాట్లాడుతూ పింగళి వెంకయ్య చూపిన చొరవ, దేశ భక్తిని ప్రేరణగా తీసుకొని ముందుకు సాగాలని యువతకు సూచించారు. సమన్వయ కర్త కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి పతాక వందనం చేసిన ర్యాలీలో జీఎల్‌టి కొఆరేడినేటర్ లయన్ మిట్టపల్లి ప్రవీణ్, ఆర్‌సి గాలిపల్లి వెంకట్, టవర్ సర్కిల్ యూత్ అసోసియేషన్ బాధ్యులు డి రవేష్‌లు జాతీయ పతాక ప్రాముఖ్యతను కొనియాడారు. బస్ స్టాండ్ కూడలి వద్ద ప్రారంభమైన ర్యాలీ కరీంనగర్ క్లబ్, రాజీవ్ చౌక్ మీదుగా టవర్‌కు చేరుకొని సామూహిక జాతీయ గీతాలాపన చేశారు.

కరీంనగర్ పట్టణ లయన్స్ క్లబ్స్ నిర్వహించిన ఈ ర్యాలీలో సమన్వయ కర్తలు లయన్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, లయన్ ఎం ప్రవీణ్‌లతో పాటు ఆర్‌సిలు లయన్ గాలిపల్లి వెంకట్, లయన్ కొండ రాంబాబు, లయన్ మెచినేని సత్యనారాయణ రావు, జెడ్‌సిలు లయన్స్ లయన్ లంబు సుధాకర్ రెడ్డి, లయన్ మెతుకు బాలకిషన్, లయన్ కోటేశ్, లయన్ తిరుమలేశ్, లయన్ పవనసుత రాజులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన పలు లయన్స్ క్లబ్బుల సీనియర్ లయన్స్ నినాదాలు చేస్తూ ర్యాలీలో చురుకుగా పాల్గొనగా ఎస్ఆర్ఆర్ కళాశాల లియోలు, ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌సిసి కెడెట్లు పాల్గొన్నారు.

# ప్రధానిగా తిరిగి ఎన్నికపై హృదయపూర్వక అభినందనలు తెలిపిన లక్సన్

న్యూఢిల్లీ, జులై 22 ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో న్యూజీలాండ్ ప్రధాని గౌరవనీయ క్రిస్టఫర్ లక్సన్ ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా భారత సార్వత్రిక ఎన్నికలలో ప్రధాని మోదీ మరోసారి ఎన్నిక కావడంపై ప్రధాని లక్సన్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

భారత్-న్యూజీలాండ్ సంబంధాలు ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలు, ప్రజల మధ్య స్నేహబంధంతో పెనవేసుకుపోయాయని వారు పేర్కొన్నారు. ద్వైపాక్షిక సహకారాన్ని భవిష్యత్తులో మరింత విస్తృతం చేసే దిశగా తమ దృఢ సంకల్పాన్ని దేశాధినేతలిద్దరూ పునరుద్ఘాటించారు.

ఉభయ పక్షాల మధ్య ఇటీవలి అత్యున్నత స్థాయి సాన్నిహిత్యంతో బలం పుంజుకున్న సంబంధాలు మరింత పటిష్టం కావాల్సిన అవసరాన్ని వారిద్దరూ ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మేరకు వాణిజ్యం, ఆర్థిక తోడ్పాటు, పశుపోషణ, ఔషధ, అంతరిక్ష, విద్య తదితర రంగాల్లో పరస్పర ప్రయోజనకర ద్వైపాక్షిక సహకార విస్తరణకు ప్రధానులిద్దరూ అంగీకరించారు.

న్యూజీలాండ్‌లోని ప్రవాస భారతీయుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రధాని లక్సన్ శ్రద్ధ చూపడంపై ప్రధానమంత్రి మోదీ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై ప్రధాని లక్సన్ స్పందిస్తూ- భారతీయుల భద్రత, శ్రేయస్సుకు నిరంతరం కృషి చేస్తామని గట్టి భరోసా ఇచ్చారు.

చివరగా, తరచూ పరస్పర సంభాషణ కొనసాగించేందుకు అధినేతలిద్దరూ నిర్ణయించారు.

# ఇంకా తానే సిఎం అనే భ్రమలోనే జగన్ - పవన్ కల్యాణ్

-జనసేన అదినేత పవన్ కల్యాణ్ ఎద్దేవా
-ఇంకా ఆయనకు తత్వం బోధపడలేదు
-వినుకొండ హత్యకు రాజకీయ రంగు
-కుట్రలకు తెరలేపితే ఇక అంతే సంగతులు

అమరావతి, జులై 22 :మాజీ ముఖ్యమంత్రి జగన్ కు ఇంకా తత్వం బోధపడలేదని అన్నారు జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ . కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా గడవక ముందే



విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో జరిగిన కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వినుకొండలో చోటుచేసుకున్న గ్రూపు తగాదాకు రాజకీయ రంగు పులిమారని విమర్శించారు. అవాస్తవాలను చెపుతూ కుట్రలకు తెర లేపుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికీ తానే సీఎం అని జగన్ అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎల్లకాలం సీఎంగానే ఉంటాననే భ్రమల్లోంచి జగన్ ను ప్రజలు బయటపడేశారని చెప్పారు. చంద్రబాబుకు తాను, తమ పార్టీ సంపూర్ణంగా సహకరిస్తుందని తెలిపారు. రాష్ట్ర పురోగతికి చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పూర్తిగా మద్దతిస్తామని చెప్పారు.

## జగన్‌తో రఘురామకృష్ణరాజు ఆప్యాయ పలకరింత..

అమరావతి, జులై 22 :ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ఈరోజు ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పై ప్రతిరోజు విమర్శలు గుప్పించే టీడీపీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆయనతో ముచ్చటించారు. జగన్ అసెంబ్లీ ఆవరణలోకి వచ్చే సమయానికి అప్పటికే అక్కడ ఉన్న రఘురామరాజు 'హాయ్ జగన్' అని పలుకరించారు. జగన్ ముందుకు కదిలిన తర్వాత ఆయనతో పాటు వెళ్లి, ఆయన వరుసలో కూర్చున్నారు.

కాసేపట్లో గవర్నర్ ప్రసంగం ప్రారంభమవుతుందనగా లేచి వెళ్లి జగన్ పక్కన రఘురామరాజు కూర్చున్నారు. జగన్ భుజంపై చేయి వేసి మాట్లాడారు. ప్రతి రోజు అసెంబ్లీకి రావాలని జగన్ కు చెప్పారు. దీనికి సమాధానంగా జగన్ మాట్లాడుతూ.. రోజూ అసెంబ్లీకి వస్తాను, మీరే చూస్తారని అన్నారు.

ఆ తర్వాత రఘురామ అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడుతూ? అసెంబ్లీకి ప్రతి రోజు రావాలని జగన్ కు చెప్పానని రఘురాజు మీడియాకు వివరించారు. అసెంబ్లీలో ప్రతిపక్షం లేకపోతే మజా ఏముంటుందని అన్నారు. ఇదే సమయంలో అసెంబ్లీ ఇన్నర్ లాబీలో వెళ్తున్న శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ తో మాట్లాడుతూ.. అసెంబ్లీలో జగన్ పక్కనే తనకు సీటు కేటాయించాలని కోరారు. దీనికి సమాధానంగా అలాగేనని కేశవ్ నవ్వుతూ చెపుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆ తర్వాత జగన్ పక్క సీటును మీరు ఎందుకు కోరుకుంటున్నారని రఘురామరాజును మీడియా ప్రశ్నించగా మజా ఉంటుందని, మీరే చూస్తారుగా అని వ్యాఖ్యానిం చారు. జగన్ ను రోజూ ర్యాగింగ్ చేస్తారా అని పక్కనే ఉన్న మరో ఎమ్మెల్యే ప్రశ్నించగా ర్యాగింగ్ చేస్తానో, మరేం చేస్తానో మీరే చూస్తారుగా అని అన్నారు.

జగన్ కు షేక్ హ్యాండ్ ఎందుకిచ్చారని మీడియా ప్రశ్నించగా అది తన ధర్మం అని చెప్పారు. మీ షేక్ హ్యాండ్ పట్ల జగన్ పాజిటివ్ గా రెస్పాండ్ కాలేదని మరికొందరు ఎమ్మెల్యేలు వ్యాఖ్యానించగా.. జగన్ ఎలా రెస్పాండ్ అయినా, ఆయనకు షేక్ హ్యాండ్ ఇవ్వడం తన ధర్మమని అన్నారు. అసెంబ్లీలో జగన్ పక్కన తనకు సీటు కేటాయిస్తే ఆయనకు అన్ని విషయాలు పూసగుచ్చినట్టు చెపుతానని తెలిపారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలపై జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు ఉండి ఎమ్మెల్యే. ఢిల్లీలో ధర్నా చేస్తానని అంటున్నారని, ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని అంటున్నారని అసలు జగన్ చేస్తున్న ఈ డిమాండ్ ఏమిటో తనకు అంతుపట్టకుండా ఉందని చెప్పారు.

# చంద్రబాబు పాపాలు పండే రోజు దగ్గర్లోనే ఉంది జగన్

అమరావతి, జులై 22 :కవలం 50 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం అన్నింటా వైఫల్యం చెందిందని వైసీపీ అధినేత జగన్ అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పారు. ఈ అరాచకపాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. అందుకే ప్రభుత్వం వేసే ప్రతి అడుగులోనూ భయం కనబడుతోందని చెప్పారు. అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం ఎంతగా భయపడుతోంది అంటే.. ఈ ఏడాది, అంటే 12 నెలల కాలానికి పూర్తిస్థాయి బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేక పోతోందని ఎద్దేవా చేశారు. దేశంలోనే తొలిసారిగా ఒక రాష్ట్రం ఒక ఏడాదిలో 7 నెలలు ఓట్ ఆన్ ఎక్కౌంట్ మీదే నడుస్తోంది అంటే ప్రభుత్వానికి ఎంత భయం ఉందన్న విషయం అర్థమవుతుందని అన్నారు.

ఎన్నికల ముందు ప్రజలను మోసం చేస్తూ, మభ్య పెడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయలేని స్థితి స్పష్టంగా కనిపిస్తోందని జగన్ చెప్పారు. అందుకే చంద్రబాబు ఎంతగా భయపడుతున్నారంటే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే, ఆ హామీలు అమలు చేయలేమన్న గుట్టు బయట పడుతుందన్న "భయం", ఎన్నికల్లో చేసిన మోసపూరిత హామీలు, అమలు చేయని పరిస్థితిలో ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అన్న "భయం" అని అన్నారు. అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు



రాష్ట్రంలో అరాచకాలను ప్రోత్సహించడం ద్వారా భయానక పరిస్థితి తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, ఆస్తుల విధ్వంసం.. వీటన్నింటి ద్వారా ఎవరూ ప్రశ్నించే సాహసం చేయకూడదు అన్న పరిస్థితి సృష్టిస్తున్నారని విమర్శించారు.

ప్రస్తుత అసెంబ్లీలో రెండే పక్షాలు ఉన్నాయని ఒకటి అధికార పక్షం, మరొకటి ప్రతిపక్షమని చెప్పారు. ప్రతిపక్షంగా కూడా ఒకే పార్టీ ఉందని, ఆ పార్టీనే ప్రతిపక్షంగా గుర్తించాలని చెప్పారు. ఆ పార్టీ నాయకుడినే, ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కానీ, ఆ పని చేస్తే.. అసెంబ్లీలో కూడా ప్రశ్నిస్తారన్న భయమని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీని, ప్రతిపక్ష నేతను గుర్తిస్తే ప్రజా సమస్యలు ప్రస్తావించడానికి అసెంబ్లీలో ఒక హక్కుగా మైక్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. అసెంబ్లీలో హక్కుగా మైక్ ఇస్తే, ప్రజల తరపున సభలో చంద్రబాబు ప్రభుత్వాన్ని విపక్షనేత ఎండగడతారని, ఆ విధంగా వారి నిజస్వరూపం ప్రజలకు తెలుస్తుందన్న భయంతో.. ఈ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీని, ప్రతిపక్ష నాయకుడిని గుర్తించడం లేదని విమర్శించారు.

ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు గడుస్తున్నా, చంద్రబాబు ఇన్ని భయాలతో పరిపాలన చేస్తున్నారని అన్నారు. అచ్చం శిశుపాలుడి పాపాల మాదిరిగా, చంద్రబాబునాయుడి పాపాలు కూడా పండే రోజు దగ్గర్లోనే ఉందని చెప్పారు. తనతో పాటు తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకులు ఢిల్లీకి వెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన, హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు, దోపిడీని.. 24వ తేదీన, అక్కడ ఫోటో గ్యాలరీ, నిరసన కార్యక్రమం ద్వారా దేశం దృష్టికి, వివిధ పార్టీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి, ఆంధ్ర రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టవలసిన అవసరాన్ని, పరిస్థితులను చెప్పబోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంతో, మాతో కలిసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# హామీలపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటన చేయాలి

-తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డా.చీమ శ్రీనివాస్




హైదరాబాద్, జూలై 22 :(ఎక్స్ ప్రెస్ న్యూస్ న్యూస్) తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన హామీలను నేరవేర్చటంపై ఈనెల 23 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాలలోనే స్పష్టమైన ప్రకటన చేయాలనితెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డా.చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నట్లే తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన 250 ఇంటి స్థలం, పెన్షన్ హామీలను ఈనెల 23 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పదివేల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. నిరుద్యోగ ఉద్యమకారులకు వడ్డీలేని రుణాలు కల్పించాలని కోరారు. ఉద్యమ జర్నలిస్టులను గుర్తించి వారికి ఉచిత ఇల్లు కట్టించి కాళీలను ప్రతి నియోజకవర్గంలో కేటాయించాలని అన్నారు. సెప్టెంబర్ 14న తెలంగాణ ఉద్యమకారుల సన్మాన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డిని ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, జానకి రెడ్డి, నరేందర్ గౌడ్, ఇంద్ర కుమార్, యాదిరెడ్డి, వీరస్వామి, కొండ స్వామి, దయానంద, భాస్కర్, కిరణ్ కుమార్, శ్రీనివాస్, పోచయ్య, రామచందర్, కీర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భారతదేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న పశువులు దేశ ఆర్థిక వ్యవస్థ , ఆహార భద్రతలో పశుసంవర్ధక రంగం ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తున్నాయి: ప్రొఫెసర్ ఎస్.పి.సింగ్ బఘేల్

న్యూఢిల్లీ, జులై 22 :భారత ప్రభుత్వ మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖకు చెందిన పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ (డి ఎ హెచ్ డి) , ఆతిథ్య ఒడిశా రాష్ట్రం సంయుక్తంగా ఒడిశా, పశ్చిమబెంగాల్, బీహార్, ఛత్తీస్ గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర, జిల్లా నోడల్ ఆఫీసర్ల (ఎస్ ఎన్ ఒ / డి ఎన్ ఒ ) కు సాఫ్ట్ వేర్ (మొబైల్ అండ్ వెబ్ అప్లికేషన్/ డ్యాష్ బోర్డు), బ్రీడ్స్ పై 21వ పశుగణన ప్రాంతీయ శిక్షణను నిర్వహించాయి. 2024 సెప్టెంబర్-డిసెంబర్ లో జరగనున్న 21వ పశుగణన నిర్వహణ కోసం కొత్తగా ప్రారంభించిన మొబైల్, వెబ్ అప్లికేషన్లపై ఆయా రాష్ట్రాల రాష్ట్ర/ జిల్లా నోడల్ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ఒడిశాలోని పూరీలో ఈ వర్క్ షాప్ జరిగింది.



కేంద్ర మత్స్య, పశుసంవర్ధక , పాడిపరిశ్రమ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్ పి సింగ్ బఘేల్ ఈ వర్క్ షాప్ ను ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఒడిశా ప్రభుత్వ ఎఫ్ అండ్ ఎ ఆర్ డి మంత్రి శ్రీ గోకులానంద మల్లిక్, పూరీ శాసనసభ్యుడు శ్రీ సునీల్ కుమార్ మొహంతి, ఒడిశా ప్రభుత్వ ఎహెచ్ అండ్ వివిఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ సురేష్ కుమార్ వశిష్ఠ ఐ సి ఎఆర్- ఎన్ బి ఎ జి ఆర్ డైరెక్టర్ డాక్టర్ బీపీ మిశ్రా, భారత ప్రభుత్వ పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ సలహాదారు (స్టాటిస్టిక్స్) జగత్ హజారికా, ఒడిశా పశుసంవర్ధక, వెటర్నరీ సైన్సెస్ డైరెక్టర్ రామశిస్ హజ్రా వర్క్ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.



ఈ వర్క్ షాప్ లో కేంద్ర సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్ పి సింగ్ ప్రసంగిస్తూ, క్షేత్రస్థాయిలో సమగ్ర శిక్షణ, సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. దేశంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోనే అత్యధిక పశు సంపద ఉందని, భారత ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రత లో పశు సంవర్ధక రంగం ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని చెప్పారు. పశు గణనను పక్కా ప్రణాళికతో అమలు చేయాలని, సేకరించిన డేటా భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించడంలో, ఈ రంగంలో సవాళ్లను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఉద్ఘాటించారు.

శ్రీమతి అల్కా ఉపాధ్యాయ వర్చువల్ విధానంలో 21వ పశు గణన విజయవంతం కావాలని శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. భారత ఆర్థిక వ్యవస్థ పై పశు సంవర్ధక రంగం ప్రభావం, పశు సంవర్ధక రంగ ఉత్పత్తుల ప్రపంచ వాణిజ్యం పరంగా భారతదేశం స్థానం గురించి ఆమె తన అభిప్రాయాలు పంచుకున్నారు.

పశుసంవర్ధక రంగంలో సుస్థిర పద్ధతుల ఏకీకరణ ఆవశ్యకతను శ్రీ గోకులానంద మల్లిక్ వివరించారు. పశుగణన తర్వాత పొందిన డేటా విశ్లేషణ మరియు తార్కిక వినియోగం భవిష్యత్తులో డిపార్ట్‌మెంటల్ విధానాలను రూపొందించడానికి, కార్యక్రమాలను అమలు చేయడానికి, అలాగే కొత్త పథకాలను సృష్టించడానికి , పశు పెంపకం రైతుల ప్రయోజనం కోసం ఎపశుసంవర్ధక రంగంలో ఉపాధిని సృష్టించడానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన అన్నారు.

శ్రీ సురేష్ కుమార్ వశిష్ట్ తన ప్రసంగంలో, పశువులను 'పశు ధన్' గా పేర్కొనే సంపద, ఆస్తులుగా పోల్చారు, తన శాఖ ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా మానవ వనరుల అభివృద్ధి తరహాలో దాని పేరు ను ఇటీవల పశు వనరుల అభివృద్ధి శాఖగా మార్చడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఒడిశా ప్రభుత్వం బీహార్ నుంచి పాల ఉత్పత్తిలో ఉత్తమ పద్ధతులను అవలంబించిందని, రైతుల ఆర్థిక సాధికారతకు పశువులు ఎలా దోహదం చేస్తున్నాయో, వారి డబ్బు అవసరాలను సమర్థవంతంగా తీరుస్తున్నాయో వివరించారు. పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ (డి ఎ హెచ్ డి ) అభివృద్ధి చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సెక్స్ క్రమబద్ధీకరించిన వీర్యం వాడకం గురించి ఆయన ప్రస్తావించారు. అన్ని రాష్ట్రాల ప్రతినిధులకు సాదర స్వాగతం పలికిన ఆయన శిక్షణ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

పశుసంవర్ధక , పాడిపరిశ్రమ శాఖ సలహాదారు (స్టాటిస్టిక్స్) శ్రీ జగత్ హజారికా మాట్లాడుతూ, ఈ వర్క్ షాప్ ప్రాముఖ్యతను వివరించారు. ఖచ్చితమైన, సమర్థవంతమైన డేటా సేకరణ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో డిపార్ట్ మెంట్ నిబద్ధతను నొక్కి చెప్పారు. పశుసంవర్ధక రంగం భవిష్యత్తు విధానాలు , కార్యక్రమాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించే 21వ పశుగణన విజయవంతం కావడానికి భాగస్వాములందరికి సమిష్టి బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. పశు గణన విజయవంతం కావడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఈ వర్క్ షాప్ లో పశుసంవర్ధక గణాంక విభాగం ద్వారా 21వ పశు గణన పై సంక్షిప్త వివరణ మొదలుకొని, గణనలో కవర్ చేయాల్సిన జాతుల వివరాలపై ఐసిఎఆర్-నేషనల్ బ్యూరో ఆఫ్ యానిమల్ జెనెటిక్ రిసోర్సెస్ (ఎన్ బిఎజిఆర్) కు చెందిన శ్రీ బిపి మిశ్రా, ఆయన బృందం ద్వారా వివరణాత్మక ప్రజంటేషన్ వరకు పలు సెషన్ లు నిర్వహించారు. ఖచ్చితమైన జాతిని గుర్తించడం వివిధ పశుసంపద రంగ కార్యక్రమాలలో ఉపయోగించే ఖచ్చితమైన గణాంకాలను తయారు చేయడానికి , సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్ డి జి ) నేషనల్ ఇండికేటర్ ఫ్రేమ్వర్క్ (ఎన్ఐఎఫ్) కోసం ఎంతో కీలకం.

వర్క్ షాప్ లో భాగంగా భారత ప్రభుత్వ పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖకు చెందిన సాఫ్ట్ వేర్ బృందం 21 వ పశుగణన కు సంబంధించిన మెథడాలజీలు, లైవ్ అప్లికేషన్‌పై రాష్ట్ర, జిల్లా నోడల్ అధికారులకు వివరణాత్మక సెషన్ లలో మొబైల్ అప్లికేషన్, డ్యాష్ బోర్డు సాఫ్ట్ వేర్ పై శిక్షణ ఇచ్చింది. ఈ నోడల్ అధికారులు ఎన్యూమరేటర్లకు ఆయా జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు.

పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖలోని పశుసంవర్ధక గణాంక విభాగం సంచాలకులు శ్రీ వి.పి.సింగ్ హాజరైన ప్రముఖులకు, భాగస్వాములకు కృతజ్ఞతలు తెలియజేశారు. పశుగణన కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# "ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటానికి అన్ని వర్గాలు చేతులు కలపాలి" : కేంద్ర మంత్రి పిలుపు

న్యూఢిల్లీ, జులై 22 :జమ్ము కశ్మీర్ లో గ్రామీణ రక్షణ దళాలను (విడిజిలు) పునరుద్ధరిస్తున్నట్టు కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రకటించారు. ఆయన శనివారం ఒక బహిరంగ సభలో పాల్గొనడంతో పాటు మూడు గంటలకు పైగా "ప్రజా దర్బార్" నిర్వహించారు.

"ఇటీవల దోడాలోను, చుట్టుపక్కల ప్రాంతాల్లోను చోటు చేసుకున్న ఉగ్రవాద సంఘటనల నేపథ్యంలో భద్రతాపరంగా పరిస్థితిని అదుపులో ఉంచడానికి భద్రతా దళాలు ఒక వ్యూహం రూపొందించుకున్నాయి. కాని అలాంటి వ్యూహాలను బహిరంగంగా చర్చించడం సాధ్యం కాదు'' అని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయమంత్రి (స్వతంత్ర హోదా); పి ఎం ఒ లో ఎంఓఎస్, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణు ఇంధన, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి చెప్పారు.

ఉగ్రవాద కార్యకలాపాల జోరు అధికంగా ఉన్న ప్రాంతాల ప్రజలను సాధికారం చేయడం లక్ష్యంగా గ్రామీణ రక్షణ దళాలను (విడిజి) పునరుద్ధరిస్తున్నట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రకటించారు. "ఉగ్రవాదులు విసురుతున్న సవాలును దీటుగా ఎదుర్కొనే బహుముఖీన వ్యూహంలో భాగంగా ఎక్కడ అవసరమైతే అక్కడ విడిజిలను రంగంలోకి దింపాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని ఆయన తెలియచేశారు. విడిజిలు ఉగ్రవాదులతో దీటుగా పోరాడేందుకు వీలుగా వాటికి ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, ఇతర ఆయుధాలు అందిస్తామని ఆయన ప్రకటించారు.

ఉగ్రవాదంపై అన్ని వర్గాలు ఉమ్మడి పోరాటం సాగించాలని మంత్రి పిలుపు ఇచ్చారు. 1990 దశకంలో ఉగ్రవాదంపతాక స్థాయిలో ఉన్న సమయంలో కూడా దోడా దానికి తలొగ్గలేదని ఆయన గుర్తు చేశారు. "ఈ ప్రాంత వాసులందరూ ఉగ్రవాద దురాగతాన్ని తీవ్రంగా ప్రతిఘటించిన కారణంగా ఈ ప్రాంతం నుంచి ప్రజల వలసలను నివారించగలిగారు" అని మంత్రి చెప్పారు.

దోడాలో మౌలిక వసతుల అభివృద్ధి గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావిస్తూ మారుమూల ప్రాంతాలకు కూడా కనెక్టివిటీ కల్పించడం, ప్రయాణ సమయాన్నితగ్గించడం, ప్రయాణికుల సౌకర్యం మెరుగుపరచడం కోసం గత 10 సంవత్సరాల్లో ప్రభుత్వం భారీ స్థాయిలో హైవే నెట్ వర్క్ ను అభివృద్ధి చేసిందన్నారు.

"వ్యూహాత్మక ప్రాధాన్యం గల ల ఖ న్ పూర్-బసోహ్లి-బనీ-భదేర్వా-దోడా జాతీయ రహదారి నిర్మాణం పూర్తయినట్టయితే ఈ మార్గంలో దూరం100 కిలోమీటర్ల మేరకు తగ్గుతుంది" అని ఆయన చెప్పారు. అలాగే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడడంతో పాటు పర్యాటకం కూడా ఉత్తేజితం అవుతుందన్నారు. అదే విధంగా నిర్మాణంలో ఉన్న, అన్ని వాతవరణ పరిస్థితులకు అనుకూలమైన ఖెల్లాని సొరంగ మార్గం పూర్తయితే దోడా, కిష్ట్వార్ జిల్లాల ప్రజలు శ్రీనగర్, జమ్ముకు వెళ్లేం ప్రయాణ సమయం విశేషంగా తగ్గుతుందని డాక్టర్ సింగ్ చెప్పారు.

జమ్ము, కశ్మీర్ లో అన్ని ప్రాంతాల సమతూకమైన అభివృద్ధికి ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. "శ్రీ మోదీ ప్రభుత్వం గత ప్రభుత్వాల లోటుపాట్లన్నింటినీ అధిగమిస్తూ జమ్ము, కశ్మీర్ లో అసంపూర్తిగా ఉండిపోయిన, తీవ్ర జాప్యం చోటు చేసుకున్న మౌలిక వసతుల ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసింది" అని చెప్పారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ సిద్ధాంతంతో పని చేస్తున్న ప్రభుత్వం లబ్దిదారుల కులం, వర్గం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఎల్ పి జి కనెక్షన్లు అందిస్తోందని, పిఎం ఆవాస్ కింద ఇళ్లు కూడా నిర్మిస్తోందని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం కల్పించవలసిన అవసరం ఉన్నదని డాక్టర్ జితేంద్ర సింగ్ నొక్కి చెప్పారు. "వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు వివరించేందుకు యువతకు, వారి తల్లిదండ్రులకు వర్క్ షాప్ లు నిర్వహించాలి'' అని స్థానిక యంత్రాంగానికి మంత్రి సూచించారు.

సభ అనంతరం కేంద్ర మంత్రి "ప్రజా దర్బార్" నిర్వహించారు. మూడు గంటలకు పైగా జరిగిన ఈ ప్రజా దర్బార్ లో ప్రజాసమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు డిప్యూటీ కమిషనర్ శ్రీ హర్విందర్ సింగ్ నాయకత్వంలో స్థానిక యంత్రాంగం పాల్గొంది.

ఈ ప్రజా దర్బార్ లో ప్రజలకు ప్రయోజనకరమైన పలు అంశాలు పరిశీలనకు వచ్చాయి. స్థానిక ప్రజలు తమ డిమాండ్లను ప్రభుత్వ ప్రతినిధులకు నివేదించి తమ ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలని కోరారు.

ప్రజల అభ్యర్థనలు విన్న డాక్టర్ జితేంద్ర సింగ్ ఆ సమస్యలను వేగంగా, సకాలంలో పరిష్కరించాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించారు. నిర్దిష్ట కాలపరిమితిలో ప్రజలకు సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారు.

# కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 30,700పై కి. మీ. సైకిల్ యాత్ర



వరంగల్ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భారత దేశ ప్రజలు వారి యొక్క సాంస్కృతిక జీవన విధానం, కళలు, గుర్చి సైకిల్ పై 30,700పై కి. మీ. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు డిసెంబర్ 2017 నుండి 2024 జూన్ 7 వరకు యువ కళాకారుడు తెలంగాణ ముద్దుబిడ్డ, చెన్నూర్ నివాసి శ్రీ పోచమ్ "చిత్ర కళా యాత్ర" చేసివారి గురువు శ్రీ సత్యనారాయణ ను మర్యాద పూర్వకంగా కలిసి కళయాత్ర విశేషమైన అనుభవాలను పంచుకున్నారు.వారిని దేశంలోని అన్ని చోట్లా , అన్నీ వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కళాకారులు ఘన స్వాగతం పలికారని, అందుకు ఒక భారతీయ పౌరునిగా గర్వంగా ఉందని అన్నారు.

నిరతరం కళ ఉపాధ్యాయుల అభ్యున్నతికి కృషి చేస్తున్నా తెలంగాణా రాష్ట్ర ఆర్ట్స్, క్రాఫ్ట్స్ ఇన్స్ట్రక్టర్స్ అసోసియేషన్ (౧౦౮౦) వ్యవస్థాపక అధ్యక్షులుతిరువరంగం ప్రభాకర్ మరియు రాష్ట్ర అధ్యక్షులు టి. కేశవ్ కుమార్ లకు ప్రత్యేకమైన అభివందనాలు తెలిపారు.

# అయిదు రోజులు పాటు ఎపి అసెంబ్లీ సమావేశాలు

-బీఏసీ సమావేశాలలో నిర్ణయం
-సమావేశాన్ని బాయ్ కాట్ చేసిన వైసిపి
-టిడిపి , జనసేన, బిజెపి సభ్యులు హాజరు

అమరావతి, జులై 22 : ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజులు నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది. జూలై 26 వరకు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి.

స్పీకర్ అయన్న పాత్రుడి అధ్యక్షతన జరిగిన బీఏసీ ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు, పయ్యావుల కేశవ్,జనసేన నుంచి మంత్రి నాదేండ్లమనోహర్, బీజేపీ నుంచి విష్ణుకుమార్ హాజరయ్యారు. వైసీపీ నుంచి ఎవరూ హాజరుకాలేదు. అన్ని శాఖలపై సభలో శ్వేత పత్రాలు విడుదల చేయాలని నిర్ణయించారు. అలాగే ఓట్ ఆన్ అకౌండ్ బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు.

# దేశంలో అన్ని కారణాలతో అధిక మరణాల రేటు మునుపటి సంవత్సరంతో పోలిస్తే
## సైన్స్ అడ్వాన్సెస్ పేపర్‌లో నివేదించిన 11.9 లక్షల కన్నా 2020లో చాలా తక్కువ

న్యూఢిల్లీ, జులై 22 :భారతదేశంలో 2020లో కోవిడ్ -19 విపత్తు సమయంలో ఆయుర్దాయంపై సైన్స్ అడ్వాన్సెస్ అనే విద్యాసంబంధ పత్రికలో ఈరోజు ప్రచురితమైన ఓ పత్రం ఆధారంగా కొన్ని మీడియా నివేదనలు ఈ అంశాలకు అధికంగా ప్రాధాన్యం ఇచ్చాయి. ఇవి అంగీకారయోగ్యమూ ఆమోద యోగ్యమూ కాని అంచనాలపై ఆధారపడినవి.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5ను విశ్లేషించడానికి ప్రామాణిక పద్ధతిని అనుసరిస్తున్నట్లు వారు పేర్కొన్నప్పటికీ, ఆ పద్ధతిలో సంక్లిష్టమైన లోపాలున్నాయి. 2021 జనవరి- ఏప్రిల్ మధ్య జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో (ఎన్ఎఫెచ్ఎస్) పేర్కొన్న కుటుంబాల ఉపసముదాయాన్ని నిర్వాహకులు తీసుకుని, 2020లో ఈ కుటుంబాల్లో మరణాలను 2019తో పోల్చారు; ఆ ఫలితాలను దేశం మొత్తానికి విస్తృతీకరించారు. ఎన్ఎఫ్హెచ్ఎస్ నమూనా మొత్తంగా పరిగణనలోకి తీసుకున్నప్పుడు మాత్రమే అది దేశం మొత్తాన్ని సూచిస్తుంది. ఇది ముఖ్యమైన లోపం. 14 రాష్ట్రాల నుంచి ఈ విశ్లేషణలో చేర్చిన 23% కుటుంబాలు దేశాన్ని ప్రతిబింబిస్తున్నాయని చెప్పలేము. మరో ప్రధానమైన లోపం సేకరించిన నమూనాలో సంభవనీయమైన ఎంపిక, నివేదనలో పక్షపాతాలకు సంబంధించినది. కోవిడ్ -19 విపత్తు తీవ్ర స్థాయిలో ఉన్న సమయంలో ఈ గణాంకాలను సేకరించడం ఇందుకు కారణం.

భారత్ సహా అల్పాదాయ, మధ్య ఆదాయ దేశాల్లో కీలకమైన నమోదు వ్యవస్థ బలహీనంగా ఉందని పేర్కొంటూ, ఇలాంటి విశ్లేషణలు అవసరమని ఆ పత్రిక తప్పుగా వాదిస్తోంది. ఇది సత్యదూరం. భారత్ లో పౌర నమోదు వ్యవస్థ (సీఆర్ఎస్) అత్యంత దృఢమైనది, 99 శాతానికి పైగా మరణాలను నమోదు చేస్తుంది. ఈ నమోదు 2015 లో 75% నుంచి 2020లో 99%కి పెరిగింది. 2019తో పోలిస్తే 2020లో మరణాల నమోదు 4.74 లక్షలు పెరిగినట్లు ఈ వ్యవస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంతకుముందు సంవత్సరాలతో పోలిస్తే 2018, 2019 సంవత్సరాల్లో మరణాల నమోదు వరుసగా 4.86 లక్షలు, 6.90 లక్షలు పెరిగాయి. ముఖ్యంగా, ముఖ్యంగా, సీఆర్ఎస్ లో ఏడాదిలో అన్ని అదనపు మరణాలకు కోవిడ్ విపత్తు కారణం కాదు. సీఆర్ఎస్ లో పెరుగుతున్న మరణాల నమోదు (2019లో ఇది 92 శాతంగా ఉంది), తదుపరి సంవత్సరంలో విస్తృతమైన జనాభా ప్రాతిపదిక కూడా ఆ సంఖ్య పెరగడానికి కారణం.

2020లో మునుపటి ఏడాది కన్నా సుమారు 11.9 లక్షల అధిక మరణాలు నమోదయ్యాయని పేర్కొన్న సైన్స్ అడ్వాన్సెస్ పత్రిక నివేదన స్థూలంగా చేసినది, అతిగా అంచనా వేసే తప్పుదోవ పట్టించేదిగా ఉన్నదని కూడా స్పష్టంగా చెప్పవచ్చు. కోవిడ్ విపత్తు సమయంలో అధిక మరణాలు అంటే అన్ని కారణాల వల్ల మరణాలు పెరగడమని, ప్రత్యక్షంగా కోవిడ్-19 వల్ల సంభవించిన మరణాలతో వాటన్నింటినీ పోల్చలేమని గుర్తించడం ముఖ్యం.

పరిశోధకులు ప్రచురించిన అంచనాలు స్వాభావికంగా తప్పుగా ఉన్నాయని దేశ నమూనా నమోదు వ్యవస్థ (ఎస్ఆర్ఎస్) గణాంకాలు ధ్రువీకరించాయి. దేశంలోని 36 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న 8842 నమూనా యూనిట్లలో 24 లక్షల కుటుంబాల్లోని 84 లక్షల మంది ప్రజలు ఎస్ఆర్ఎస్ పరిధిలోకి వస్తారు. 2018, 2019 సంవత్సరాలకు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే విశ్లేషణ, నమూనా నమోదు సర్వే విశ్లేషణల ఫలితాలు పోల్చదగినవని చూపడానికి అమితంగా కష్టపడుతున్న వారు, 2020 లో ఎస్ఆర్ఎస్ గణాంకాలు తక్కువగా ఉన్నాయని, 2019 గణాంకాలతో పోలిస్తే అధిక మరణాలు (2020లో అల్పాయుష్షు మరణాలు/ క్రూడ్ డెత్ రేటు 6.0/ 1000, 2019లో 6.0/1000) లేవని, ఆయుఃప్రమాణంలో తగ్గుదల లేదని నివేదించడంలో పూర్తిగా విఫలమయ్యారు.

వయస్సు, లింగంపై ఫలితాలను ఈ పత్రిక నివేదించింది. భారతదేశంలో కోవిడ్-19పై పరిశోధన, కార్యక్రమాల రూపకల్పన గణాంకాలకు ఇది విరుద్ధం. మహిళలు, యుక్త వయస్కుల్లో (ముఖ్యంగా 0-19 సంవత్సరాల పిల్లలు) అధిక మరణాలు ఎక్కువగా ఉన్నాయని ఆ పత్రిక పేర్కొన్నది. అయితే, కోవిడ్ -19 కారణంగా నమోదైన 5.3 లక్షల మరణాల గణాంకాలు, అలాగే బృందాలు, నమోదు పట్టికల పరిశోధన గణాంకాలను పరిశీలిస్తే కోవిడ్ -19 కారణంగా మహిళల కన్నా పురుషులలో (2:1), వృద్ధులలో (0-15 సంవత్సరాల పిల్లల కన్నా 60 సంవత్సరాలు, ఆపై వయస్సున్న వారిలో అనేక రెట్లు ఎక్కువ) కోవిడ్ -19 కారణంగా మరణాల రేటు స్థిరంగా ఎక్కువగా ఉంది. ప్రచురితమైన పత్రంలోని ఈ అస్థిరమైన, అస్పష్టమైన ఫలితాలు దాని వాదనపై నమ్మకాన్ని మరింత తగ్గిస్తున్నాయి.

చివరిగా, భారతదేశంలో 2020లో, దాని క్రితం సంవత్సరంతో పోలిస్తే అన్ని కారణాల వల్ల జరిగిన అధిక మరణాలు సైన్స్ అడ్వాన్సెస్ పత్రికలో నివేదించిన 11.9 లక్షల మరణాల కన్నా చాలా తక్కువ. ఈ రోజు ప్రచురితమైన పత్రం అనుసరించిన పద్ధతి లోపభూయిష్టంగా ఉంది. అది చూపిన ఫలితాలు అంగీకార యోగ్యమూ ఆమోద యోగ్యమూ కావు.

## ఎక్సీమ్ బ్యాంక్ కుంభకోణం పై సిబిఐ ఎంక్వైరీ చేయాలి

హైదరాబాద్ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి సంచలన ఆరోపణలు చేసారు. సోమవారం అసెంబ్లీ ప్రెస్ మీట్ పాయింట్స్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ యూరో ఎక్సీమ్ బ్యాంక్ కుంభకోణంలో మంత్రి కంపెనీ భాగస్వామిగా ఉందని ఆరోపించారు. ఇదీ దేశంలోనే భారీ కుంభకోణం ఇందులో చాలా మంది బడా కాంట్రాక్టర్లతో పాటు రాష్ట్ర కేబినెట్ మంత్రి ప్రమేయం ఉంది.

ఇందులో కేబినెట్ మంత్రి భాగస్వామి గా ఉండటం బాధాకరం.ఇది వేల కోట్ల కుంభకోణంకు సంబందించిన భ్యాంక్ గ్యారంటీల విషయం.దేశ చట్టాలకు సంబంధం లేనట్టువటి యూరో ఎక్సిమ్ బ్యాంక్ సెయింట్ లూసియా అనే చిన్న దివిలో ఉంది .యూరో ఎక్సిమ్ బ్యాంక్ ఒక ఫైనాన్స్ కంపనీ .ఈ బ్యాంక్ గ్యారెంటీ మన దేశంలో చెల్లదు, అయినా ఏజెన్సీలు దీన్ని యాక్సెప్ట్ చేయడం గమనార్హం .ఆర్బీఐ గైడ్లైన్ లో లేని ఫైనాన్స్ కంపెనీ ఒక్క లెటర్ రాస్తే ... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్యారంటీ ఇచ్చింది .ఈ లెటర్ ఐడీచూస్తే ఎస్బిఐ గ్యారంటీ ల ఉంది .ఇది ఒక ఉదాహారణ మాత్రమే..నన్నారు..ఈ గ్యారంటీ లెటర్ నిజమో కాదో, తేల్చాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు.

## చట్టం తన పని తాను చేసుకుపోతుంది - ఎమ్మెల్యేలతో చంద్రబాబు

**-కూటమి ఎమ్మెల్యేలతో చంద్రబాబు**
**అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో భేటి**
**శాండ్ పాలసీలో ఎమ్మెల్యేల జోక్యం వద్దు**
**కవ్వింపు చర్యలకు ఎవరూ పాల్పడవద్దన్న పవన్ కల్యాణ్**

అమరావతి, జులై 22 :అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు తమ కూటమి ఎమ్మెల్యేలకు దిశ నిర్దేశం



చేశారు.. అసెంబ్లీ కమిటీ హాలులో ఎన్డీఏ సభ్యులు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు.

అసెంబ్లీలో అనుసరించాల్సిన విధివిధానాలపై ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. గడిచిన ఐదేళ్లు వైసీపీ పెట్టిన ఇబ్బందులని సీఎం దృష్టికి తీసుకెళ్లారు ఎమ్మెల్యేలు.

దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. ఈ విషయాంపై చట్ట ప్రకారం ముందుకెళ్దామని, చట్టం తన పని తను చేస్తుందంటూ సీఎం చెప్పారు. సాండ్ పాలసీలో ఎవరు జోక్యం చేసుకోవద్దంటూ సూచించారు. కలిసికట్టుగా అందరూ కలిసి పనిచేయాలంటూ దిశా నిర్దేశం చేశారు.

ఈ క్రమంలోనే ఎట్టి పరిస్థితుల్లోనూ కవ్వింపు చర్యలకు పాల్పడద్దని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు.

నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వేసే కమిటీల్లో అన్ని పార్టీలను కలుపుకోవాలని కోరారు.

## హైదరాబాద్‌లో ఖనిజాన్వేషణ హ్యాకథాన్ సహా నేషనల్ డిఎంఎఫ్ పోర్టల్‌కు
## కేంద్ర బొగ్గు-గనులశాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి శ్రీకారం

ఖనిజాన్వేషణలో వినూత్న పద్ధతులపై దృష్టి సారించడంలో భాగంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఖనిజాన్వేషణ హ్యాకథాన్‌ను కేంద్ర బొగ్గు-గనులశాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ఇవాళ ప్రారంభించారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి శ్రీ విజయ్ కుమార్ సిన్హా సహా గనులశాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వాధి. కారులు,




ప్రభుత్వ సంస్థల-పరిశ్రమల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భూ-భౌతిక సమాచార సేకరణ, వివిధ ఖనిజాల అన్వేషణ ద్వారా సేకరించిన సమాచార సమాహారం సమన్వయంలో కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి వర్ధమాన సాంకేతికతల వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ హ్యాకథాన్ నిర్వహణ ధ్యేయం. కొత్త ఖనిజ లక్ష్యాల గుర్తింపు, ప్రాథమిక సమాచారం, ఇప్పటికే అందుబాటులోగల అన్వేషణ సమాచారం కూడా ఈ సమాహారంలో భాగంగా ఉంటాయి. ముఖ్యంగా భూమి లోతుల్లో దాగిన/అంతర్భాగంగా మారిపోయిన ఖనిజ నిక్షేపాల కోసం గాలించడంలో వినూత్న సాంకేతికతల దిశగా కొత్త ఆలోచనల కు ఇది రూపమిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా "గ్లింప్స్ ఆఫ్ జియాలజీ అండ్ మినరల్ రిసోర్సెస్, తెలంగాణ", "మినరల్స్ ఇన్ తెలంగాణ-స్పాట్‌లైట్స్" పుస్తకాలను కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర భౌగోళిక స్థానం, దాంతోపాటు రాష్ట్రం లో సంభావ్య ఖనిజ లభ్యతపై ప్రధా నంగా దృష్టి సారిస్తూ ఈ రచనలు వెలువడ్డాయి.

## తుంగభద్ర నుంచి హెచ్ఎల్‌సీకి నీటి విడుదల..

అమరావతి, జులై 22 :కర్ణాటకలో భారీ వర్షాల వల్ల తుంగభద్ర జలాశయం నిండుకుంటుంది. ప్రస్తుతం జలాశయం 1633 వరకు గాను 1627 అడుగులుగా నీటిని నిలువలు ఉన్నాయి.

ఎగువ నుంచి 1, 04,600 క్యూసెక్కుల నీరు జలాశయంకు చేరుతుంది. దీంతో సోమవారం ఉదయం తుంగభద్ర జలాశయం నుంచి హెచ్ ఎల్ సి కి 100 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర డ్యామ్ అధికారులు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 105 టీఎంసీల నిల్వలకు గాని 84 టీఎంసీల నీరు ఉంది.

## 2024 మే నెలలో ఇ.పి.ఎఫ్.ఓ.లో చేరిన 9.85 లక్షల కొత్త సభ్యులు

న్యూఢిల్లీ, జులై 22 :ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇ.పి.ఎఫ్.ఓ.)లో 19.50 లక్షల సభ్యులు 2024 మే నెలలో కొత్తగా చేరారు. 2018 ఏప్రిల్ మాసంలో జారీ చేయబడిన మొదటి పేరోల్ డేటా నుండి ఇప్పటి వరకు ఒక నెలలో చేరిన వారి సంఖ్య పరంగా ఇదే అత్యధికం.

పైగా, సంవత్సరంవారీ విశ్లేషణలో 2023 మే నెలతో పోల్చితే ఈసారి చేరిన నికర సభ్యుల సంఖ్యలో 19.62% వృద్ధి నమోదైంది. మెరుగైన ఉపాధి అవకాశాలు, ఉద్యోగికి కలిగే ప్రయోజనాల గురించి అవగాహన పెరగడం, ఇ.పి.ఎఫ్.ఓ. ఔట్‌రీచ్ కార్యక్రమాలు ప్రభావవంతంగా ఉండడం సహా అనేక కారణాలు ఈ సభ్యత్వాల పెరుగుదలకు దోహదం చేశాయని చెప్పవచ్చు.

2024 మే నెలలో దాదాపు 9.85 లక్షల మంది కొత్త సభ్యులు చేరినట్లు డేటా సూచిస్తుంది. అంతకువయందు నెల 2024 ఏప్రిల్‌తో పోలిస్తే కొత్త సభ్యులలో 10.96% వృద్ధి అలాగే గత సంవత్సరం 2023 మే నెలతో పోలిస్తే 11.5% వృద్ధి నమోదైంది.డేటాలో గమనించదగిన అంశం ఏమిటంటే, 2024 మే నెలలో జోడించబడిన మొత్తం కొత్త సభ్యులలో గణనీయంగా 58.37% మంది 18-25 ఏళ్ల వయస్సు గల వారే ఉండడం విశేషం. సంఘటిత రంగంలో కొత్తగా ఉద్యోగాలలో చేరే వారిలో చాలామంది యువత, మొదటిసారి ఉద్యోగం పొందినవారే కావడం మునుపటి ధోరణికి అనుగుణంగా ఉంది.

పైగా, మొదటి పేరోల్ ప్రచురించబడినప్పటి నుండి ఇప్పటివరకు 18-25 వయస్సు గల వారి కోసం 2024 మే నెలలోనే నికర పేరోల్ డేటా అత్యధికంగా ఉంది.

సుమారు 14.09 లక్షల మంది సభ్యులు నిష్క్రమించి, తిరిగి ఇ.పి.ఎఫ్.ఓ.లో చేరిన విషయాన్ని పేరోల్ డేటా ప్రధానంగా సూచిస్తుంది. ఈ సంఖ్య మే 2023తో పోల్చితే సంవత్సరానికి 23.47% వృద్ధిని చూపుతుంది. ఈ సభ్యులు తమ ఉద్యోగాలను మార్చుకుని, తిరిగి ఇ.పి.ఎఫ్.ఓ. పరిధిలోకి వచ్చే సంస్థల్లో చేరారు అలాగే వారు ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం దరఖాస్తు చేయడానికి బదులుగా వారి జమ చేయబడిన మొత్తాన్ని బదిలీ చేయడాన్ని ఎంచుకున్నారు తద్వారా వారి దీర్ఘకాలిక ఆర్థిక శ్రేయస్సు, వారి సామాజిక భద్రతకు భరోసాను పొందారు.

ఈ నెలలో జోడించబడిన కొత్త సభ్యులలో దాదాపు 2.48 లక్షల మంది కొత్త మహిళా సభ్యులేనని పేరోల్ డేటా జెండర్ వారీ విశ్లేషణ వెల్లడించింది. ఈ సంఖ్య 2023 మే నెలతో పోలిస్తే సంవత్సరానికి 12.15% వృద్ధిని నమోదు చేసింది. అలాగే, ఈ నెలలో నికర మహిళా సభ్యుల చేరిక దాదాపు 3.69 లక్షలకు చేరుకుంది, ఇది 2023 మే నెలతో పోలిస్తే సంవత్సరానికి 17.24% వృద్ధిని సూచిస్తుంది. మహిళా సభ్యుల చేరికల్లో పెరుగుదల మరింత సమగ్రమైన, విభిన్నమైన కార్మికశక్తి వరంగా విస్తృత మార్పును సూచిస్తుంది.రాష్ట్రాల వారీ పేరోల్ డేటా విశ్లేషణను గమనిస్తే ఐదు రాష్ట్రాలు/యుటీలలో అనగా మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, గుజరాత్ అలాగే హర్యానాలలో నికర సభ్యుల చేరిక అత్యధికంగా ఉంది. ఈ రాష్ట్రాలు దాదాపు 58.24% నికర సభ్యుల చేరికను కలిగి ఉన్నాయి అలాగే ఈ నెలలో మొత్తం 11.36 లక్షల మంది నికర సభ్యులు ఈ రాష్ట్రాల నుండి కొత్తగా చేరారు. ఈ నెలలో 18.87% నికర సభ్యులను జోడించడం ద్వారా మహారాష్ట్ర అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉంది.

పరిశ్రమవారీగా నెలవారీ డేటాను పోల్చిచూసినప్పుడు అది నిపుణుల సేవలు, భవన, నిర్మాణ రంగం, గార్మెంట్స్ తయారీ, వస్త్ర పరిశ్రమ, ఎలక్ట్రికల్, మెకానికల్, జనరల్ ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఇంజనీర్స్ ? ఇంజనీరింగ్ కాంట్రాక్టర్స్, వర్తక ? వాణిజ్య సంస్థలు, బీడీల తయారీ, ఎలక్ట్రానిక్ మీడియా వంటి ప్రైవేట్ రంగ సంస్థలలో పనిచేసే సభ్యుల చేరికలో గణనీయమైన వృద్ధి కనిపించినది. మొత్తం నికర సభ్యత్వాలలో సుమారు 42.33% చేరికలతో నిపుణుల సేవల రంగం (మ్యాన్‌పవర్ సప్లయర్స్, సాధారణ కాంట్రాక్టర్స్, సెక్యూరిటీ సర్వీసెస్, ఇతరత్రా కార్యకలాపాలు కలిగి ఉండునది) అగ్రస్థానంలో ఉంది.

ఉద్యోగి వివరాలను నవీకరించడం నిరంతరం సాగే ప్రక్రియ కాబట్టి డేటా రూపొందించుట కూడా నిరంతరం జరుగుతూ ఉండడం వల్ల పై పేరోల్ డేటా తాత్కాలికమైనదిగా పరిగణించబడుతుంది. మునుపటి డేటా ప్రతి నెలా నవీకరించబడుతుంది. ఇ.పి.ఎఫ్.ఓ. 2017 సెప్టెంబర్ కాలాన్ని కవర్ చేస్తూ మొదటిసారిగా 2018 ఏప్రిల్ నెల నుండి పేరోల్ డేటాను విడుదల చేయడం ప్రారంభించింది. నెలవారీ పేరోల్ డేటాలో, నికర నెలవారీ పేరోల్ పొందడానికి, ఆధార్ ధ్రువీకరణ గల యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యు.ఎ.ఎన్.) ద్వారా మొదటిసారిగా ఇ.పి.ఎఫ్.ఓ.లో చేరుతున్న సభ్యుల సంఖ్య, ప్రస్తుత సభ్యులలో ఇ.పి.ఎఫ్.ఓ. కవరేజీ నుండి నిష్క్రమించి, తిరిగి చేరిన సభ్యుల సంఖ్యను పరిగణిస్తారు.

## తమ భూమిలో రోడ్డు వేయడాన్ని వ్యతిరేకిస్తూ మహిళల ఆందోళన

**-ఇద్దరు మహిళపై ట్రక్కు మట్టి లోడ్‌ను పోసిన డ్రైవర్**
**-మట్టిలో కూరుకుపోయిన మహిళలు**

భోపాల్ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తన భూమిలో రోడ్డు వేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన



చేపట్టిన ఇద్దరు మహిళపై ట్రక్కు మట్టి లోడ్‌ను పోశారు. దీంతో సదరు మహిళలు మట్టిలో కూరుకుపోయిన సంఘటన మధ్య ప్రదేశ్‌లోని రేవా జిల్లా మంగావా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం హినోత్ జోరాట్ గ్రామంలో మమతా పాండే, ఆశా పాండే మహిళలు వ్యవసాయ భూమిని లీజుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. వాళ్లు పంటలు పండించే భూమిలో నుంచి రోడ్డు చేపడుతామని చెప్పడంతో సదరు మహిళలు వ్యతిరేకించారు. వారు లీజు తీసుకున్న భూమిలో మట్టి పోసేందుకు ట్రక్కు రావడంతో మమతా, ఆశాలకు అడ్డుకున్నారు. అక్కడ నిలబడి నిరసన తెలుపుతున్న మహిళలపై ట్రక్కు డ్రైవర్ మట్టిపోయడంతో మట్టిలో కూరుకుపోయారు.తల మాత్రమే బయటకు కనిపించగా దేహం మొత్తం మట్టిలో కూరుకుపోయింది. స్థానికులు వెంటనే స్పందించి వారిని మట్టిలో నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు ఆరోగ్య పరిస్థితి సాధారణంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన వీడియోను భోపాల్ కాంగ్రెస్ తన ట్విట్టర్‌లో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. మహిళా రైతులతో ప్రవర్తించే పద్ధతి ఇదేనా అని నెటిజన్లు మండిపడుతున్నారు. మహిళా రైతులకు జరుగుతున్న నష్టాన్ని ఇచ్చిన తరువాత రోడ్డు పనులు చేపడితే బాగుండేదని నెటిజన్లు వాపోతున్నారు. ఇలాంటి దుశ్చర్యాలకు పాల్పడడం సరికాదని మండిపడుతున్నారు. వారిపై మట్టి పోసి ట్రక్కు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్టు సమాచారం.

## భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం

**- రెండో ప్రమాద హెచ్చరిక జారీ**

భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరింది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఆదివారం రాత్రి భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 44 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం 46 అడుగుల వద్ద ప్రవహించింది. మధ్యాహ్నం 2 గంటల సమయానికి 48 అడుగులు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అయితే ఎగువన ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నది ఉగ్రరూపం దాల్చింది. సాయంత్రం నాటికి నదీ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు వెల్లడించారు.అదేవిధంగా ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదారమ్మ మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్నది. మొదటి ప్రమాద హెచ్చరిక 14.830 మీటర్లు కాగా, ప్రస్తుతం 15.130 మీటర్లు వుంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రతగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.భద్రాద్రి జిల్లాలో ఉన్న రెండు ప్రాజెక్టులకు వరద నీరు చేరింది. కిన్నెరసానిలో 16 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదలిపెట్టారు. 407 అడుగుల నీటి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 403.30 అడుగులు నీటిమట్టం ఉంది. సాయంత్రానికి ఆరు గేట్లు ఎత్తివేశారు. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టులో మొత్తం 25 గేట్లను ఎత్తి 92,121 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గోదావరి వరద ప్రభావం వల్ల అక్కడ ఈతవాగు పొంగడంతో గుంపల్లి చర్ల గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. పర్ణశాలలో సీతవాగు పొంగి ప్రవహిస్తోంది. దుమ్ముగూడెం మండలంలో గుబ్బలమంగి ప్రాజెక్టులో భారీగా వరదనీరు చేరడంతో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో "గోరింటాకు సంబరాలు"




హైదరాబాద్ జూలై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కమలానగర్ స్పందన క్లబ్ మహిళల కోసం"ఆషాడంలో గోరింటాకు సంబరాలు" అనే పేరుతో ఒక విశిష్ట కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని ఈసిఐఎల్ సౌత్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ లో నిర్వహించబడింది. లయన్స్ ఇంటర్నేషనల్ గురించి అవగాహన మరియు సందేశాన్ని వ్యాప్తి చేయడానికి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమాన్ని ఆధజాక్షురాలు కృష్ణవేణి, సెక్రటరీ శ్రీమతి వాణి, కోశాధికారి ఎం ఎన్ చారి రూపకల్పన చేసారు. ఈ కార్యక్రమానికిజిల్లా ప్రథమ మహిళ 320 సి లయన్ వి.గీత గారు ముఖ్య అతిథిగా లయన్ కె ఉమా దేవి గౌరవ అతిథిగా హాజరయ్యారు. విచ్చేసిన ప్రముఖులు జిల్లా గవర్నర్ లయన్ వి కృష్ణ ప్రసాద్ , లయన్ జి. శేఖర్ రెడ్డి (డిసిఎస్), లయన్ డా.లక్ష్మీ మూర్తి (డిసిఎం), లయన్ జి.అలేక్య రెడ్డి (జిల్లా చైర్‌పర్సన్ -మహిళా సాధికారత), లయన్ మల్కా రమా దేవి (జెడ్‌సి), హైదరాబాద్ కమలానగర్ నుండి క్లబ్ అధ్యక్షులు స్ఫూర్తి లయన్ వి.భాస్కర్ రెడ్డి మరియు హైదరాబాద్ శ్రీ శక్తి లయన్ బి.సావిత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద మరియు వికలాంగ మహిళ కోసం కుట్టు మిషన్‌ను స్పాన్సర్ చేసినందుకు లయన్ జి. శేఖర్ రెడ్డి (డిసిఎస్) మరియు లయన్ జి.అలేక్య రెడ్డి (జిల్లా చైర్‌పర్సన్ -మహిళా సాధికారత)లకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో దాదాపు 90 మంది మహిళలు పాల్గొన్నారు. మెహందీ కార్యక్రమంతో పాటు కొన్ని ఆటలు కూడా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని లయన్ లేడీస్ టి. హేమలత, ఎ. లక్ష్మి, కవిత, కరుణావతి విజయవంతంగా నిర్వహించారు.




# న్యూఢిల్లీలోని భారత మండపంలో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సమావేశానికి ప్రధానమంత్రి శ్రీకారం

న్యూఢిల్లీ, జులై 22 : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ న్యూఢిల్లీలోని భారత మండపంలో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సమావేశాన్ని ప్రారంభించారు. ప్రపంచ వారసత్వ సంబంధిత అంశాలన్నిటి నిర్వహణ, ఆ జాబితాలో చేర్చాల్సిన ప్రదేశాలపై తుది నిర్ణయం వంటివి ఈ కమిటీ బాధ్యతలు. ఈ దిశగా ప్రతి సంవత్సరం నిర్వహించే కమిటీ సమావేశానికి భారత్ తొలిసారి ఆతిథ్యమిస్తోంది. ఈ నేపథ్యంలో భారత మండపంలో ఏర్పాటు చేసిన వివిధ అంశాల ప్రదర్శనను ప్రధానమంత్రి తిలకించారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ- ముందుగా గురు పూర్ణిమ శుభదినాన దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినం నాడు ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశం ప్రారంభం కావడం... దీనికి తొలిసారి భారత్ అతిథ్యమివ్వడం హర్షణీయమన్నారు. సమావేశానికి హాజరైన ప్రపంచ ప్రముఖులు, అతిథులను... ముఖ్యంగా 'యునెస్కో' డైరెక్టర్ జనరల్ శ్రీమతి ఔడ్రే అజూలేని ప్రధానమంత్రి సాదరంగా స్వాగతించారు. భారతదేశంలో నిర్వహించిన అనేక అంతర్జాతీయ సభలు, సమావేశాల తరహాలో ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశం కూడా చరిత్రలో కొత్త రికార్డులు సృష్టించగలదని ఆయన విశ్వాసం వెలిబుచ్చారు.

భారత కళాఖండాలు విదేశాల నుంచి తిరిగి స్వదేశం చేరడాన్ని ప్రస్తావిస్తూ- ఇటీవలి కాలంలో 350కిపైగా ప్రాచీన వారసత్వ వస్తుసామగ్రిని వెనక్కు తెచ్చినట్లు ప్రధాని గుర్తుచేశారు. ఈ సందర్భంగా "ప్రాచీన వారసత్వ కళాఖండాలను వెనక్కు ఇవ్వడం చరిత్రపై ప్రపంచానికిగల గౌరవం, ఔదార్యానికి నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. సాంకేతిక పరిజ్ఞాన ప్రగతి వల్ల ఈ రంగంలో పరిశోధన-పర్యాటక అవకాశాలు పెరుగుతుండటాన్ని నొక్కిచెప్పారు.

ప్రపంచ వారసత్వ కమిటీకి ప్రశంసలు తెలుపుతూ... ఈ సమావేశ నిర్వహణ భారత్‌కు ఎంతో గర్వకారణమని ప్రధాని అభివర్ణించారు. యునెస్కో 'ప్రపంచ ప్రసిద్ధ వారసత్వ ప్రదేశాల' జాబితాలో ఈశాన్య భారతంలోని చారిత్రక 'మైదామ్'కు చోటుకల్పిస్తూ ప్రతిపాదించడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "యునెస్కో జాబితాలో ఇది భారత 43వ ప్రపంచ వారసత్వ ప్రదేశం. అలాగే ప్రపంచ సాంస్కృతిక వారసత్వ హోదా పొందిన ఈశాన్య భారత తొలి వారసత్వం" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ జాబితాలో చేరిన 'మైదామ్' తనదైన విశిష్ట సాంస్కృతిక ప్రాముఖ్యం ద్వారా మరింత అంతర్జాతీయ ప్రాచుర్యం పొంది, ప్రపంచాన్ని ఎంతగానో ఆకర్షించగలదని ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సమావేశానికి ప్రపంచవ్యాప్త నిపుణులు పెద్ద సంఖ్యలో తరలిరావడమే దీనికిగల విస్తృతి, ఆమోదయోగ్యతలకు నిదర్శనమని ప్రధానమంత్రి అన్నారు. ప్రపంచ సజీవ ప్రాచీన నాగరికతలలో ఒకటైన ఈ నేలపై దీనికి ఆతిథ్యమివ్వడం ఎంతో ప్రత్యేకమని ఆయన చెప్పారు. ప్రపంచంలో వైవిధ్య భరిత వారసత్వ ప్రదేశాలున్నాయని పేర్కొంటూ భారత ప్రాచీన శకాల గురించి ఆయన ప్రస్తావించారు. ఈ మేరకు "భారత్ అత్యంత ప్రాచీన దేశం కాబట్టే నేటి ప్రతి క్షణం గతకాలపు ఉజ్వల చారిత్రక గాథలెన్నిటినో ప్రతిబింబిస్తుంది" అని వ్యాఖ్యానించారు. భారత రాజధాని న్యూఢిల్లీని ఉటంకిస్తూ- వేల ఏళ్ల వారసత్వ కేంద్రమైన ఈ నగరంలో అడుగడుగునా వారసత్వం-చరిత్ర సాక్షాత్కరిస్తాయని ప్రధాని చెప్పారు. ఈ సందర్భంగా 2000 సంవత్సరాల నాటి తుప్పు నిరోధక 'ఉక్కు స్తంభం' ప్రాశస్త్యాన్ని ఉదాహరించారు. గతకాలపు భారత లోహశాస్త్ర నైపుణ్యానికి ఇది అద్దం పడుతుందని పేర్కొంటూ- "భారత వారసత్వం కేవలం చరిత్రకు పరిమితం కాదు... అదొక విజ్ఞాన శాస్త్రం" అని ఆయన స్పష్టం చేశారు. అలాగే 8వ శతాబ్దం నాటి 3,500 మీటర్ల ఎత్తునగల కేదార్‌నాథ్ ఆలయం గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. అగ్రశ్రేణి ఇంజనీరింగ్ ప్రమాణాల దిశగా భారత వారసత్వ పయనానికి ఇదొక ప్రత్యక్ష సాక్ష్యమని ఆయన వివరించారు. ప్రతి శీతాకాలంలో ఎడతెగని హిమపాతం వల్ల ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పన నేటికీ సవాలుగా ఉన్నదని గుర్తుచేశారు. దక్షిణ భారతంలోని చోళ సామ్రాజ్య చక్రవర్తి రాజరాజ చోళుడు తమిళనాడులో నిర్మించిన బృహదీశ్వరాలయం, దాని అద్భుత నిర్మాణ శైలి, అందులోని మూల విరాట్ ప్రాశస్త్యాన్ని కూడా వివరించారు.

గుజరాత్‌లోని ధోలవీర, లోథాల్ గురించి కూడా ప్రధాని విశదీకరించారు. క్రీ.పూ. 3000 నుంచి 1500 మధ్య పురాతన నగరం ధోలవీర పట్టణ ప్రణాళిక-జల నిర్వహణ వ్యవస్థలకు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. అలాగే లోథాల్ కోట విశిష్టత సహా దాని ప్రాథమిక ప్రణాళిక, వీధులు, విస్తృత మురుగు పారుదల సదుపాయం తదితరాలు అద్భుత ప్రాచీన ప్రణాళికలకు నిదర్శనమని పేర్కొన్నారు.

అదేవిధంగా "భారత చరిత్ర, చరిత్రపై దేశానికిగల అవగాహన సాధారణం కన్నా ఎంతో ప్రాచీనమేగాక విస్తృతమైనవి. కాబట్టి, సాంకేతిక ప్రగతి, నవ్యావిష్కరణల సాయంతో నవ్య దృక్కోణాల నుంచి గతాన్ని సరికొత్తగా ఆవిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉంది" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని సినౌలీలో పురావస్తు తవ్వకాల్లో బయల్పడిన చారిత్రక విశేషాలను ఆయన ఉటంకించారు. సింధులోయ నాగరికతతో పోలిస్తే ఇక్కడ వేదకాలపు నాగరికతకు మరింత సమీప తామ్ర (రాగి) యుగ అవశేషాలు ఇక్కడ వెలుగు చూశాయని వెల్లడించారు. ఈ మేరకు 4000 ఏళ్లనాటి అశ్వరథం అవశేషాలు లభ్యమైందని తెలిపారు. భారతదేశం గురించి లోతుగా తెలుసుకోవాలంటే దురభిమానం వీడి, కొత్త భావనలతో ముందడుగు వేయాల్సిన అవసరాన్ని ఇది స్పష్టం చేస్తున్నదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. తదనుగుణంగా ఈ కొత్త స్రవంతిలో భాగం కావాల్సిందిగా సదస్యులకు ఆహ్వానం పలికారు.

వారసత్వ ప్రాముఖ్యాన్ని నొక్కిచెబుతూ- "వారసత్వమంటే చరిత్ర మాత్రమే కాదు.. అది మానవాళి సామూహిక చైతన్యం. చారిత్రక ప్రదేశాలను దర్శించినపుడల్లా నేటి భౌగోళిక-రాజకీయాంశాలకు అతీతంగా అవి మన మేధను తట్టిలేపుతాయి" అని ప్రధానమంత్రి నిర్వచించారు. ఈ ప్రదేశాలను జన హృదయ స్పందనకు జోడిస్తూ వారసత్వ సామర్థ్యాన్ని ప్రపంచ శ్రేయస్సుకు ఉపయోగించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. "వారసత్వానికి పరస్పర ప్రోత్సాహంతోపాటు మానవ సంక్షేమ స్ఫూర్తి విస్తరణ దిశగా ఏకం కావడంపై ఈ 46వ ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశం ద్వారా ప్రపంచానికి భారత్ మేల్కొలుపు పలుకుతోంది. అలాగే పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ మరిన్ని ఉద్యోగావకాశాల సృష్టికి కృషి చేద్దామని పిలుపునిస్తోంది" అని శ్రీ మోదీ ప్రకటించారు.

ప్రగతి పథంపై మాత్రమే దృష్టి సారించి, వారసత్వాన్ని విస్మరించిన కాలాన్ని ప్రధానమంత్రి గుర్తుచేశారు. అయితే, భారతదేశం నేడు "వికాస్ భీ... విరాసత్ భీ"... దృక్కోణంతో ప్రగతి-వారసత్వం జమిలిగా సాగే విధానాలను అమలు చేస్తున్నదని ఆయన వివరించారు. ఈ మేరకు గడచిన పదేళ్లలో వారసత్వ ప్రతిష్టను సగర్వంగా చాటుకునేలా కాశీ విశ్వనాథ కారిడార్, శ్రీరామ మందిరం, పురాతన నలంద విశ్వవిద్యాలయ ప్రాంగణం ఆధునికీకరణ వంటి వినూత్న చర్యలు చేపట్టడాన్ని ప్రధాని ఉదాహరించారు. "వారసత్వ ప్రతిష్ట పునరుద్ధరణపై భారతదేశ సంకల్పం యావత్ మానవాళికీ సేవ అనే ఉదాత్త భావనతో ముడిపడినది. అంటే- భారతీయ సంస్కృతి 'మనం' అంటుంది... 'నేను' అనే సంకుచిత భావనకు ఇందులో తావులేదు" అన్నారు.

ప్రపంచ సంక్షేమంలో భాగస్వామ్యానికి భారత్ చేస్తున్న కృషిని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఈ మేరకు భారత వైజ్ఞానిక వారసత్వమైన యోగా, ఆయుర్వేద విజ్ఞానాలను నేడు ప్రపంచం మొత్తం అనుసరించడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా "ఒకే ప్రపంచం.. ఒకే కుటుంబం.. ఒకే భవిష్యత్తు" ఇతివృత్తంతో జి-20 శిఖరాగ్ర సదస్సుకు ఆతిథ్యమివ్వడాన్ని గుర్తుచేశారు. "వసుధైవ కుటుంబకం' అనే భారతీయ దార్శనికతకు అనుగుణంగా చిరుధాన్యాల సాగు-వినియోగాన్ని ప్రోత్సహించడం, అంతర్జాతీయ సౌరశక్తి కూటమి, 'మిషన్ లైఫ్' వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం వగైరాలను ప్రధానమంత్రి ప్రస్తావించారు.

ప్రపంచ వారసత్వ సంపద పరిరక్షణను భారత్ ఒక బాధ్యతగా పరిగణిస్తుందని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. తదనుగుణంగా భారతీయ వారసత్వంసహా దక్షిణార్థ గోళ దేశాల్లో వారసత్వ సంపద పరిరక్షణకూ సహకరిస్తున్నామని గుర్తుచేశారు. ఈ మేరకు అంగ్‌కోర్ వాట్ (కంబోడియా), చామ్ టెంపుల్స్ (వియత్నాం), బగన్ స్తూపాలు (మయన్మార్) వంటి వారసత్వ ప్రదేశాల జాబితాను ఉటంకించారు. ఈ సందర్భంగా యునెస్కో ప్రపంచ వారసత్వ కేంద్రానికి భారత్ తరఫున 1 మిలియన్ డాలర్ల విరాళం అందజేస్తామని ప్రకటించారు. ఈ నిధులు ముఖ్యంగా దక్షిణార్థ గోళ దేశాల్లో ప్రపంచ వారసత్వ ప్రదేశాల పరిరక్షణ, సామర్థ్య వికాసం, సాంకేతిక సహాయం దిశగా సద్వినియోగం కాగలవని చెప్పారు. భారత యువ నిపుణుల కోసం 'ప్రపంచ వారసత్వ సంపద నిర్వహణపై సర్టిఫికేట్ ప్రోగ్రామ్' కూడా ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. భారత సాంస్కృతిక-సృజనాత్మక పరిశ్రమ అంతర్జాతీయ వృద్ధికి కీలకాంశం కాగలదని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

చివరగా, భారత్ గురించి మరింత అవగాహన కోసం దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాలని ఈ సమావేశంలో పాల్గొంటున్న విదేశీ అతిథులు, ప్రముఖులందరికీ ప్రధానమంత్రి సూచించారు. అలాగే విశిష్ట పర్యాటక ప్రదేశాల పర్యటనకు కల్పించిన సౌలభ్యాలను కూడా వివరించారు. చిరస్మరణీయ అనుభవాలను పదిలపరచుకునేలా ఈ పర్యటనను సద్వినియోగం చేసుకోగలరని ఆకాంక్షిస్తున్నానంటూ ఆయన తన ప్రసంగం ముగించారు.

ఈ కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్, కేంద్ర సాంస్కృతిక-పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్, యునెస్కో డైరెక్టర్ జనరల్ శ్రీమతి ఔడ్రీ అజూలే, ప్రపంచ వారసత్వ కమిటీ చైర్‌పర్సన్ శ్రీ విశాల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీలోని భారత మండపంలో 2024 జులై 21 నుంచి 31 వరకు నిర్వహించే ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశానికి భారత్ తొలిసారి ఆతిథ్యమిస్తోంది. ఏటా నిర్వహించే ఈ సమావేశాల్లో ప్రపంచ వారసత్వ ప్రదేశాల నిర్వహణ, జాబితాలో చేర్చాల్సిన ప్రదేశాలపై తుది నిర్ణయం ఈ కమిటీ బాధ్యతలు. ఈ మేరకు ప్రస్తుత జాబితాలోని 124 ప్రపంచ వారసత్వ ప్రదేశాల పరిరక్షణ నివేదికలను కమిటీ పరిశీలిస్తుంది. ఈ జాబితాలో చేర్చే కొత్త ప్రదేశాలపై ప్రతిపాదనలు స్వీకరిస్తుంది. అంతర్జాతీయ సహాయం, ప్రపంచ వారసత్వ నిధుల వినియోగం వగైరాలపై చర్చిస్తుంది. మొత్తం 150కిపైగా దేశాల నుంచి 2000 మందికిపైగా జాతీయ-అంతర్జాతీయ ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు.

ఈ సమావేశంతోపాటు "వరల్డ్ హెరిటేజ్ యంగ్ ప్రొఫెషనల్స్ ఫోరమ్", "వరల్డ్ హెరిటేజ్ సైట్ మేనేజర్స్ ఫోరమ్" సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు.

మరోవైపు భారత మండపంలో భారతీయ సంస్కృతిని ప్రస్ఫుటం చేసే పలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా 'రిటర్న్ ఆఫ్ ట్రెజర్స్' పేరిట ఇప్పటిదాకా స్వదేశానికి తిరిగివచ్చిన 350కిపైగా కళాఖండాలలో కొన్నిటితో నిర్వహిస్తున్న ప్రదర్శన విశేష ఆకర్షణగా నిలుస్తోంది. అలాగే దేశంలోని ప్రపంచ వారసత్వ ప్రదేశాల్లోని మూడు విశేషాలు- "రాణి కీ వావ్, పటాన్ (గుజరాత్); కైలాస దేవాలయం, ఎల్లోరా గుహలు (మహారాష్ట్ర); హోయసల ఆలయం, హళేబీడు (కర్ణాటక) ప్రాంతాలపై ప్రత్యక్ష సందర్శానానుభవం కల్పించేలా దృశ్య-శ్రవణ సాంకేతికతతో కనువిందు చేసే ప్రదర్శనలు నిర్వహిస్తారు. అలాగే 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' పేరిట సమాచార సాంకేతికత-మౌలిక సదుపాయాల రంగంలో ఆధునిక పరిణామాలు సహా సుసంపన్న భారత సాంస్కృతిక వారసత్వం, ప్రాచీన నాగరికత, భౌగోళిక వైవిధ్యం, పర్యాటక ప్రదేశాలను ప్రముఖంగా వివరించే ప్రదర్శన కూడా నిర్వహిస్తున్నారు.

## 'విష్బాక్స్' ఒక రేంజ్ లో ఉన్న ఆధునిక యాజమాన్య పరిష్కారాలను మెర్సిడెస్ బెంజ్ వినియోగదారులకు అందిస్తుంది'




హైదరాబాద్, జులై 22 : "'మెర్సిడెస్ బెంజ్ ఆర్థిక సేవలు భారతీయ వినియోగదారుల అవసరాలను నివృత్తి చేస్తున్నాయి, ఆధునిక ఆర్థిక ఉత్పత్తులను ఒక దశాబ్దం నుంచి అందిస్తున్నాయి. ఈ సంవత్సరం మేము పేరు గాంచిన ఆర్థిక పరిష్కారాలను విష్బాక్స్ ద్వారా అందిస్తున్నాము. ఇది వ్యక్తిగత ఆర్థిక పరిష్కారాలను వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు అందిస్తున్నాము. ఈ కార్యక్రమం మనం వినియోగదారులని ఎంత బాగా అర్థం చేసుకుంటున్నాము అనే దాన్ని సూచిస్తుంది మరియు మెర్సిడెయా బెంజ్ యొక్క నవగొలు ద్వారా కొనుగోలుదారుల అవసరాలను తీరుస్తుంది. విష్బాక్స్ ఆర్థిక పరిష్కారాలతో పాటు ప్రస్తుతం ఉన్న ఆగిలిటీ ని మరియు స్టార్ ఫైనాన్స్ ఉత్పత్తులను మార్కెట్ లో ప్రవేశపెడుతుంది."బ్రెడన్ సిస్సింగ్, మెర్సిడెస్ బెంజ్ ఆర్థిక సేవల యొక్క మేనేజింగ్ డైరెక్టర్ మరియు సి ఈ ఓ"మెర్సిడెస్ బెజ్ ప్రపంచ వ్యాప్త విలాసవంతమైన ఎన్నడూ చూడని టెక్నాలజీ తో పాటు విభిన్నమైన మరియు నిర్దిష్ట వినియోగదారుని అనుభవాన్ని కూడా అందిస్తుంది. లాంచ్ కోసం వేచి చూస్తున్న ఆరు మోడల్స్ యొక్క లంచ్ లో రాబోయే రెండవ సగం చాలా ఉత్తేజితంగా ఉంటుంది. ఇవి మెర్సిడెస్ బెంజ్ యొక్క బ్రాండ్ ని అత్యధిక స్థాయికి తీసుకొని వెళతాయి." మెర్సిడెస్ బెంజ్ ఇండియా యొక్క సేల్స్ మరియు మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్, లాన్స్ బెన్నెట్

# ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అశాస్త్రీయంగా విడదీశారు

- -ఉమ్మడి ఏపీ విభజన రాష్ట్ర ప్రజల హృదయాల్లో మాయని మచ్చ
- -రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ వల్ల అల్లకల్లోలం ఏర్పడింది
- - రాష్ట్ర ప్రజలు సుదీర్ఘకాలం అభివృద్ధి, పురోగతికి నోచుకోలేదు
- - ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- - గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న వైసీపీ సభ్యులు

అమరావతి జులై 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అశాస్త్రీయంగా విడదీశారని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. భాగస్వాములతో చర్చలు చేయకుండా విభజించారని చెప్పారు. ఉమ్మడి ఏపీ విభజన రాష్ట్ర ప్రజల హృదయాల్లో మాయని మచ్చగా మిగిలిందని తెలిపారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ వల్ల అల్లకల్లోలం ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రజలు సుదీర్ఘకాలం అభివృద్ధి, పురోగతికి నోచుకోలేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. రాష్ట్ర విభజన వల్ల ఏపీకి నష్టం ఏర్పడిందన్నారు. రాజధాని హైదరాబాద్‌ను కోల్పోయామని చెప్పారు. తద్వారా ఆర్థిక నష్టం జరిగిందన్నారు. 'కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు. ఆంధ్రప్రదేశ్ సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. 2014లో ఏపీ అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేశారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో పెట్టుబడుల వరద కొనసాగింది. అనేక సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చాయి. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి రాష్ట్రంలో అన్ని రంగాలు నష్టాలు చవిచూశాయి. చంద్రబాబు హయాంలో వచ్చిన పెట్టుబడిదారులు వెనక్కి మళ్లారు. 2019-2024 మధ్య కాలంలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లింది. విభజన చట్టం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తగినంత పరిహారం ఇవ్వలేదు. ఆస్తులు, అప్పుల పంపిణీలో అసమానతలు ఉన్నాయి. అశాస్త్రీయ విభజన వల్ల 46 శాతం వనరులు మాత్రమే వారసత్వంగా వచ్చాయి. రాజధాని హైదరాబాద్‌ను కోల్పోవడం వల్ల ఆర్థిక నష్టం జరిగింది. భారీ రెవెన్యూ లోటు వారసత్వంగా వచ్చింది. ప్రాంతం ఆధారంగా ఆస్తులు.. వినియోగం ఆధారంగా విద్యుత్ పంపిణీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా విద్యాసంస్థలు విభజించారు. ఉన్నత విద్యాసంస్థలు కోల్పోయాం. ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం లక్షా 6 వేల 176 కోట్లు. విభజిత ఏపీలో తలసరి ఆదాయం 93 వేల 121 కోట్లకు పడిపోయింది. రాష్ట్ర విభజన వల్ల ప్రతికూల ప్రభావం పడింది. అపరిష్కృత సమస్యల వల్ల సవాళ్లు వచ్చాయి. విభజన వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని చంద్రబాబు ప్రభుత్వం అవకాశంగా మలచుకుంది సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ప్రభుత్వం పునాది వేసింది. సముద్ర తీరం, నౌకాశ్రయ ఆధారిత అభివృద్ధిపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించింది. తయారీ కార్యకలాపాలకు అవసరమైన వాతావరణంపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించింది. 2014-19 మధ్య కాలంలో అభివృద్ధి, సంక్షేమం మధ్య స్పష్టమైన సమతుల్యం ఉంది. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతో పట్టిసీమ రికార్డు సమయంలో పూర్తయింది. ఏడాది సమయంలోనే చంద్రబాబు ప్రభుత్వం పట్టిసీమ పూర్తిచేసింది. చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తయింది. ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చారు. కరవు నివారణ చర్యలు, రియల్‌టైమ్ గవర్నెన్స్ చేపట్టారు. భూసేకరణ ద్వారా అమరావతి ప్రాంత అభివృద్ధి చేశారు. కొత్త సచివాలయం, శాసనసభ భవన నిర్మాణం చేశారు. చంద్రబాబు దూరదృష్టి నాయకత్వం వల్లే 2014-19 మధ్య అభివృద్ధి సాధ్యమైంది.' అంటూ గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.

అయితే గవర్నర్ ప్రసంగాన్ని వైసీపీ సభ్యులు అడ్డుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో వెనకబడిపోయిందన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. హత్యా రాజకీయాలు నశించాలి.. సేవ్ డెమోక్రసీ అంటూ నినాదాలు చేశారు. అయినా గవర్నర్ ప్రసంగం కొనసాగడంతో.. నిరసగా విపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ నుంచి వాకౌట్ చేశారు. కాగా, గవర్నర్ ప్రసంగం ద్వారా తెలంగాణపై తన దుర్బుద్ధిని చంద్రబాబు మరోసారి బయటపెట్టుకున్నారని తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తన అభిప్రాయాలను గవర్నర్ ద్వారా చెప్పించారని విమర్శిస్తున్నారు.

# తెలంగాణలో విమానాశ్రయాల నిర్మాణాలు చేపట్టండి

## - లోక్ సభ బడ్జెట్ సమావేశాల్లో కోరిన ఖమ్మంఎంపీ రఘురాంరెడ్డి



ఖమ్మం, జులై 22: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో నిర్వహణలో హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఒక్కటే ఉందని, మూడు కొత్తగా గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, మూడు బ్రౌన్ ఫీల్డ్ విమానాశ్రయాలు నిర్మించాల్సిన అవసరం ఉందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కాగా..ఎంపీ ఈ మేరకు మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం, జక్రాన్ పల్లి నిజామాబాద్ జిల్లా, మహబూబాబాద్ జిల్లాల్లో నిర్మించాల్సి ఉందని తెలిపారు. బ్రౌన్ ఫీల్డ్ కు సంబంధించి మామునూరు- వరంగల్ అర్బన్ జిల్లా, బానత్ నగర్ పెద్దపల్లి జిల్లా, ఆదిలాబాద్ జిల్లాలో వినియోగంలోకి తేవాలని కోరారు. హైదరాబాద్ నుంచి ఎక్కువ దూరంలో ఉన్న జిల్లాల కోసం కొత్త ఎయిర్ పోర్టులు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని గుర్తు చేశారు.

ఎయిర్ పోర్ట్స్ అథారిటీ గతంలోనే భూ పటిష్టత, సాంకేతిక, ఇతర సర్వేలన్నీ పూర్తి చేసి.. ఆమోదం తెలిపిందని ఎంపీ రఘురాం రెడ్డి అన్నారు. పౌర విమాన యాన శాఖ మంత్రి స్పందించి వీలైన౦త త్వరలో తెలంగాణలో ఎయిర్పోర్ట్స్ ల నిర్మాణం చేపట్టాలని, కనీసం రెం డు వరకు పూర్తి చేయాలని ఈ సం దర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి కోరారు.

# ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతిపత్రం అందజేత



ఖమ్మం, జులై 22: (నేటినిజం ప్రతినిధి): పలు సమస్యలపై ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం బాధ్యులు బాణోతు భద్రు నాయక్ మాట్లాడుతూ...కోయ చెలక రెవెన్యూ సర్వేనెంబర్ 192పరిధిలో గల పువ్వాడ ఉదయ నగర్ గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద 2009లో తాడోజు నాగమణి అనే మహిళకు ప్లాట్ నెంబర్ ఏ/253, 75గజాల స్థలాన్ని కేటాయించారు. కాగా గ్రామ మాజీ సర్పంచ్ సోదరుడు తన కుమార్తె కి ఈ ప్లాట్ లో అక్రమంగా ఇంటిని నిర్మించి ఇచ్చాడని ఆరోపించారు. ఈ విషయంపై అనేక దఫాలుగా తహసిల్దార్ కు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని తెలిపారు. అదేవిధంగా రఘునాథపాలెం మండలంలోని కె.వి బంజర గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషన్ గా పనిచేస్తున్న అజ్మీర శ్రీనివాస్ రావుకు అదే గ్రామంలో సూరా నరసింహారావు అనే వ్యక్తి కులం పేరుతో దూషించిన అంశంపై పోలీసులు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని ఆరోపించారు. కలెక్టర్ సంబంధిత అధికారులకు అందించిన వినతి పత్రంపై చర్యలు తీసుకోవాలని రాతపూర్వక ఆదేశాలు జారీ చేశారు. వినతిపత్రం అందించిన బృందంలో నాయకులు ఉపేంద్ర బాయి, రవీందర్ నాయక్, దేవళ్ల నాగేశ్వరరావు, పగిడిపల్లి నాగేశ్వరరావు, స్పందన, జ్యోతి, వీరన్న, శ్రీనివాస్, రమేష్, రాము, బాధితులు తాడోజు నాగమణి, తాడోజు వెంకట చారి, అజ్మీర శ్రీనివాస రావు తదితరులున్నారు.

# లూయిస్ ఫిలిప్ ప్రారంభించిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, శివసేన రెడ్డి



హైదరాబాద్, జులై 22 : లూయిస్ ఫిలిప్, ఆదిత్య బిర్లా ఫ్యాషన్ రిటైల్ హౌస్ నుండి భారతదేశపు ప్రముఖ పురుషుల దుస్తుల బ్రాండ్, మహబూబ్ నగర్ లో తన మొదటి స్టోర్ను ప్రారంభించినట్లు సగర్వంగా ప్రకటించింది. లూయిస్ ఫిలిప్, దాని అద్భుతమైన నైపుణ్యం, క్లాసిక్ శైలికి ప్రసిద్ధి చెందిన బ్రాండ్, ఈ ప్రతిష్టాత్మక ప్రయోగంతో భారతదేశం అంతటా తన ఉనికిని విస్తరిస్తుంది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి హాజరయ్యారు. కొత్త లూయిస్ ఫిలిప్ స్టోర్ మహబూబ్నగర్లోని హై స్ట్రీట్ అవుట్లెట్ గ్రౌండ్ ఫ్లోర్లో విశాలమైన 1165 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. పెర్మాప్రెస్ ఫార్మల్ షర్ట్లు, గేమ్స్కేప్ ఫ్యాషన్ టీ-షర్టులు, గోల్ఫ్ లీజర్ పోలో టీ-షర్టులు, స్మార్ట్ ఫిట్ జీన్స్, వాష్డ్ ఇండిగో షర్టులు మరియు రాయల్ వెడ్డింగ్ కలెక్షన్స్‌లోని ఎంపికలతో సహా లూయిస్ ఫిలిప్ యొక్క తాజా సేకరణలు ఈ స్టోర్‌ములో అందుబాటులో ఉంటాయి.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫరీదా కలియదన్, సి ఓ ఓ , లూయిస్ ఫిలిప్ మాట్లాడుతూ , "మహబూబ్ నగర్ పురుషుల ప్రీమియం దుస్తుల పరిశ్రమకు అనేక అవకాశాలను అందిస్తుంది. ఈ నగరానికి లూయిస్ ఫిలిప్ తమ వ్యాపారం మా నగరం అడుగిడడం మేము సంతోషిస్తున్నాము అని అన్నారు . మా కొత్త స్టోర్ అందించడంలో మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. తెలంగాణలోని చక్కని అభిరుచి గల కస్టమర్లకు అసమానమైన షాపింగ్ అనుభవానని అందజేయడంతో పాటు, ప్రతి మనిషి యొక్క వార్డ్రోబ్ను మరింత ఎలివేట్ చేయడానికి రూపొందించిన మా తాజా సేకరణలను ప్రదర్శిస్తుంది. ఇక్కడ కమ్యూనిటీని స్వాగతించడానికి ఇక్కడ శాశ్వతమైన సంబంధాలను వినియంగదారులతో ఏర్పరచుకోవలని ఆశిస్తున్నాము అని అన్నారు "స్టోర్ ప్రారంభించిన ప్రదేశం, విస్తారమైన లేఅవుట్ నగరంలోని ఆధునిక కస్టమర్ల ఫ్యాషన్ అవసరాలను తీర్చడానికి రూపొందించబడ్డాయి, లూయిస్ ఫిలిప్ నుండి వచ్చిన ప్రతి సేకరణ అత్యాధునిక డిజైన్, సున్నితమైన హస్తకళల పట్ల బ్రాండ్ యొక్క అంకితభావాన్ని ప్రదర్శిస్తుంది, దీని వలన ప్రతి వినియోగదారుడు వారి ప్రత్యేక శైలికి సరిపోయేదాన్ని ఎంపిక చేసుకోవడం సాధ్యమవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, రిలయన్స్ మార్ట్ పక్కన షో రూమ్ ప్రారంభించినట్లు సంస్థ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

# గుజరాత్ తీరంలో మోటారు ట్యాంకర్ జీల్ నుంచి తీవ్ర అస్వస్థతకు గురైన భారతీయుడిని తరలించిన ఐసీజీ

న్యూఢిల్లీ, జులై 22 :భారత తీర రక్షక దళం (ఐసీజీ) 2024 జులై 21న, గుజరాత్ లోని మంగ్రోల్ తీరానికి సుమారు 20 కి.మీ. దూరంలో ఉన్న గాబన్ మోటార్ ట్యాంకర్ జీల్ నుంచి తీవ్ర అస్వస్థతకు గురైన భారతీయుడిని తరలించింది. తక్కువ నాడీస్పందన, శరీరం తిమ్మిరెక్కడం వంటి లక్షణాలను ఎదుర్కొంటున్న ఆ వ్యక్తిని తక్షణ వైద్యం కోసం తరలించారు.

అతితీవ్ర గాలులు, భారీ వర్షం, ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ పోరుబందర్ లోని ఐసీజీ ఎయిర్ ఎన్ క్లేవ్ వెంటనే ఒక అధునాతన తేలికపాటి హెలికాప్టర్ ను మోటార్ ట్యాంకర్ జీల్ వద్దకు పంపింది. మోటార్ ట్యాంకర్ కు సరిగ్గా పైభాగంలోకి వచ్చిన హెలికాప్టర్ నుంచి ఓ రెస్క్యూ బాస్కెట్ ను పంపించి అస్వస్థతకు గురైన వ్యక్తిని తరలించారు. మెరుగైన వైద్యం కోసం అతడిని పోరుబందర్ కు తరలించారు.

సముద్ర భద్రతపై ఐసీజీకి గల అచంచల నిబద్ధత, అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ అత్యవసరమైతే స్పందించేందుకు దాని సంసిద్ధతను ఈ విజయవంతమైన తరలింపు స్పష్టం చేస్తోంది.







Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.